teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 129 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 3 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

### కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. కొత్త సభ్యులను చేర్చుకోవడం మరియు పార్టీలో ఉన్న సభ్యులను పునరుద్ధరించడంపై డ్రైవ్ దృష్టి పెడుతుంది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా నుంచి

మిగతా 2 లో




# రాష్ట్ర వ్యాప్తంగా వర్షం బీభత్సం

### వరదలతో పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌లు

### భారీ వర్షాలకు పలు జిల్లాల్లో నేడు పాఠశాలలకు సెలవు

### ఈ మేరకు జిల్లా అధికారులు ప్రకటన విడుదల

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలతో పలు ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో 481 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేయగా 152 రైళ్లను దారి మళ్లించారు. దీంతో దేశంలోని పలు రాష్ట్రాలకు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్ మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి కేసముద్రం-ఇంటికన్నె స్టేషన్ల మధ్య 30 మీటర్ల

మిగతా 2 లో




# డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను ఏర్పాటుకు సీఎం నిర్ణయం

### వరదలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): భవిష్యత్తులో భారీ వర్షాలు, వరదల వంటి విపత్తులను సమ-ర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కురు-స్తున్న భారీ వర్షాలు, వరదలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 25 పెద్ద టవర్లు కూలిపోయినప్పటికీ విద్యుత్తు సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని ముఖ్యమంత్రి

మిగతా 2 లో



## రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

### సోషల్ మీడియా పోస్టులపై వివరణకు ఆదేశాలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై వివరణ

మిగతా 2 లో

దేశవ్యాప్తంగా సాధారణంకంటే 7 శాతం

## అధికంగా వర్షపాతం

### తెలంగాణలో 29, ఏపీలో 43 శాతం అధిక వర్షపాతం

భారత వాతావరణ శాఖ వెల్లడి



.. వివరాలు 2లో



## నిండుకుండలా హుస్సేన్‌సాగర్

### ఎఫ్‌టీఎల్‌కు చేరిన హుస్సేన్‌సాగర్

హైదరాబాద్, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో

మిగతా 2 లో

## స్మిత సబర్వాల్‌పై చర్యలకు హైకోర్టులో పిటిషన్




హైదరాబాద్, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ఆలిండియా సర్వీసుల్లో (ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్) వికలాంగుల కోటా అవసరమా అంటూ ఐఏఎస్ స్మితా సబర్వాల్ చేసిన కామెంట్స్ పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. వికలాంగులపై స్మితా సబర్వాల్ చేసిన ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు

మిగతా 2 లో

## కుల గణనన పిటిషన్ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

### ఈ సమస్య పాలన పరిధిలోకి వస్తుందని సూచనలు



.. వివరాలు 2లో



## వర్షాలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు విచారం

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను వరదలు ముంచెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వర్షాలు, వరదలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

మిగతా 2 లో

## ప్రాణాలు కోల్పోతే రూ. 5 లక్షలు నష్టపరిహారం అన్యాయం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ. 5 లక్షలు నష్టపరిహారం ప్రకటించటం అన్యాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాగా మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు నష్ట పరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి

మిగతా 2 లో





## 11 జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరిక

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఈరోజు దాదాపు 11 జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరించి నందున ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

మిగతా 2 లో

# రాష్ట్ర వ్యాప్తంగా వర్షం బీభత్సం

మొదటి పేజీ తరువాయి
మేర మహబూబాబాద్ -తాళ్లపూసపల్లి స్టేషన్ల మధ్య 20 మీటర్ల మేర ట్రాక్ కొట్టుకుపోయి పట్టాలు గాలిలో వేలాడాయి. ప్రత్యేక రైలు ద్వారా 8 ఎక్స్‌కవేటర్లను తెప్పించిన అధికారులు ఆదివారం నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా పట్టాల కింద మట్టిని నింపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాక్ పునరుద్ధరణ పనులను సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పరిశీలించారు. వర్షం తెరిపిస్తే మంగళవారం సాయంత్రానికి డబుల్ లైన్లలో ఒకదాన్ని పునరుద్ధరించి రాకపోకలను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కాగా, దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఐదు రైళ్లు జలదిగ్బంధంలో చిక్కుకుపోవడం ఇదే తొలిసారి అని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆదివారం ట్రాక్ కొట్టుకుపోయి విజయవాడ-కేసముద్రం సెక్షన్‌లో నిలిచిపోయిన 15 రైళ్లను ఖమ్మం సమీపంలోని మోటుమర్రి స్టేషన్ నుంచి విష్ణుపురం మీదుగా ఇతర మార్గాల్లోకి మళ్లించారు. కేసముద్రం రైల్వే స్టేషన్‌లో జల దిగ్బంధంలో చిక్కుకుపోయిన బెంగళూరు -దానాపూర్, దానాపూర్ - బెంగళూరు సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లలోని ప్రయాణికులను ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లతో బయటకు తెచ్చారు. బస్సుల్లో వారిని కాజీపేట, విజయవాడకు తరలించారు. అక్కడి నుంచి ప్రత్యేక రైళ్ల ద్వారా వారిని దానాపూర్, బెంగళూరుకు పంపించారు. ఏపీ, తెలంగాణలో ట్రాక్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో నిలిచిపోయిన రైళ్లలోని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడానికి రైల్వే 158



ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రత్యేక రైళ్లు, బస్సుల్లో సుమారు పది వేల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్టు వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే నిర్వహిస్తున్న నాలుగు వందే భారత్ రైళ్లలో రెండింటిని రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మార్గంలో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను పూర్తిగా రద్దు చేయగా, సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్‌ను 5గంటలు ఆలస్యంగా రీ షెడ్యూలు చేశారు.

**పలు జిల్లాల్లో నేడు పాఠశాలలకు సెలవు**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారీ వర్షాల హెచ్చరికలతో మంగళవారం కూడా పలు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించింది. సోమవారం సెలవు ప్రకటించిన సంగతి తెలిసిందే. భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా అధికారులు ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆదేశాలను అన్ని పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సెలవు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు%ఔ

ఇక తెలంగాణ మరో మూడు నాలుగు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ నెల 5 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని వాయువ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేసింది.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం రిపోర్ట్ ప్రకారం%ఔ%. ఇవాళ(సెప్టెంబర్ 03) ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

## డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ను ఏర్పాటుకు సీఎం నిర్ణయం

మొదటి పేజీ తరువాయి
గుర్తు చేశారు. అదే విధంగా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్తు సమస్యలు, ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని గుర్తించి తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి నష్టాలను నివారించాలని చెప్పారు. వాగులు, వంకలు పొర్లుతున్న దృష్ట్యా దెబ్బతిన్న రోడ్లు, వరద ప్రవహిస్తున్న రోడ్లపై నుంచి ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని ముఖ్యమంత్రి హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులు బృందాలు ఏర్పడి అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి తెలిపారు.

## రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

మొదటి పేజీ తరువాయి
ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై సుప్రీంకోర్టు వివరణ అడిగింది. కవిత బెయిల్ అంశంపై సోషల్ మీడియా పోస్టులను సీరియస్‌గా తీసుకుంది. కవితకు బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? అంటూ తెలంగాణ కాంగ్రెస్ పోస్ట్ చేసింది. కమలంతో స్నేహం కవితక్కకు మోక్షం అంటూ పేర్కొంది. తెలంగాణ కాంగ్రెస్ పోస్టులపై వివరణ ఇవ్వాలంటూ పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు రెండు వారాల గడువును ఇచ్చింది.

## కుల గణనన పిటిషన్ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల సంక్షేమం కోసం సామాజిక-ఆర్థిక కుల గణనను నిర్వహించాలని కేంద్రాన్ని ఆదేశించమని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఈ సమస్య పాలన పరిధిలోకి వస్తుందని పేర్కొంది. జస్టిస్ హృషికేష్ రాయ్ , ఎస్వీఎన్. భట్టిలతో కూడిన ధర్మాసనం పిటిషనర్ పి. ప్రసాద్ నాయుడు తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించింది. అతను జనాభా గణన కోసం డేటా గణనను వేగవంతం చేయాలని కోరుతూ పిటిషన్ వేశాడు. కానీ విచారణకు ధర్మాసనం నిరాకరించడంతో ఉపసంహరించుకున్నాడు. దీనిపై ఏమి చేయవచ్చు, సమస్య పాలన పరిధిలో ఉంది. ఇది విధానపరమైన అంశం అని పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రవిశంకర్ జంధ్యాల, న్యాయవాది శ్రవణ్ కుమార్ కరణమ్‌లకు ధర్మాసనం తెలిపింది. అనేక దేశాలు కుల గణన చేశాయని, కానీ భారత్ ఇంకా చేయలేదని జంధ్యాల ఆవేదన వ్యక్తం చేశారు. 1992 నాటి ఇంద్ర సాహ్నీ తీర్పు (మండల్ కమిషన్ తీర్పు) ఈ కుల జనాభా గణనను కాలానుగుణంగా నిర్వహించాలని పేర్కొంది, అని ఆయన వాదించారు. ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకోజాలదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. కోర్టు మూడ్‌ని పసిగట్టిన న్యాయవాది, బెంచ్ అనుమతించని పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. కరణం ద్వారా దాఖలు చేసిన తన పిటిషన్‌లో నాయుడు కేంద్రం, దాని ఏజెన్సీలు ఇప్పటి వరకు జనాభా లెక్కలు-2021 కోసం గణనను నిర్వహించలేదని అన్నారు. జనాభా గణన కేవలం జనాభా వృద్ధి తెలుసుకోడానికి కాదని, ఇది విధాన రూపకల్పన, ఆర్థిక ప్రణాళిక, వివిధ పరిపాలనా ప్రయోజనాల కోసం పనికొస్తుందని, దేశ ప్రజల సమగ్ర సామాజిక - ఆర్థిక డేటాను కూడా అందిస్తుందని పేర్కొన్నారు. సామాజిక-ఆర్థిక కుల గణన వెనుకబడిన వర్గాలను గుర్తించడానికి, సమాన వనరుల పంపిణీని నిర్ధారించడానికి ,లక్ష్య విధానాల అమలును పర్యవేక్షించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. 1931లో కులాల వారీగా జరిగిన గణాంకం డేటా చాలా పాతది. జనాభా గణన , సామాజిక-ఆర్థిక కుల గణన నుండి ఖచ్చితమైన డేటా సామాజిక న్యాయం, రాజ్యాంగ లక్ష్యాలను సాధించడానికి కేంద్ర ప్రభుత్వానికి కీలకమైనది. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా 2011లో నిర్వహించిన %ాజుజజ% కుల సమాచారంతో సహా సామాజిక - ఆర్థిక సూచికలపై సమగ్ర డేటాను సేకరించడం లక్ష్యంగా పెట్టుకుంది అని వినతి పేర్కొంది.

## దేశవ్యాప్తంగా సాధారణంకంటే 7 శాతం అధికంగా వర్షపాతం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణంకంటే 7 శాతం అధికంగా వర్షపాతం నమోదయినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు 707.4 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఏకంగా 759.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని వివరించింది. దేశంలోని 14 రాష్ట్రాల్లో సాధారణం కన్నా భారీ వర్షాలు కురిశాయని, అందులో రెండు తెలుగు రాష్ట్రాలున్నాయని తెలిపింది.

తెలంగాణలో 581.2 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కన్నా 29 శాతం అధికంగా 751.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, ఆంధ్రప్రదేశ్‌లో 373.6 మిల్లీమీటర్లకు గానూ 534.3 మిల్లీమీటర్లు అంటే 43 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని వెల్లడించింది. తెలంగాణలో ఏడు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురవగా, ఏపీలో నాలుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడినట్లు వివరించింది. అలాగే భారీ వర్షాల జాబితాలో తెలంగాణలో 11, ఏపీలో 21 జిల్లాలున్నట్లు తెలిపింది. మిగతా జిల్లాలో సాధారణ వర్షపాతం ఉందని పేర్కొంది. దేశంలో అతిభారీ వర్షాలు కురిసిన జిల్లాలు అధికంగా తమిళనాడులో 19, రాజస్తాన్‌లో 14 జిల్లాలు ఉన్నాయని వెల్లడించింది.

## రాజీవ్ గాంధీ విమానాశ్రయం "ప్రైవేట్ చార్టెడ్ ఫ్లైట్స్" కోసం వెసులుబాటు



హైదరాబాద్, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ప్రైవేట్ చార్టెడ్ ఫ్లైట్స్ ఉన్నవారికి గుడ్ న్యూస్. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వారికోసం ఓ వెసులుబాటు తీసుకువచ్చింది. ప్రైవేట్ విమానాల్లో ప్రయాణించే వినియోగదారులకు ప్రత్యేక టెర్మినళ్ళను సోమవారం ప్రారంభించింది. ఇకపై ప్రైవేట్ విమానాలను ఉపయోగించే ప్రయాణికులు సాధారణ ప్రయాణికుల టెర్మినళ్లలో రద్దీని భరించడం తప్పుతుంది. వ్యాపార నిమిత్తం లేదా వ్యక్తిగత ప్రయాణాలకు వారి స్వంత ఛార్టర్ విమానాలను వినియోగించుకునేవారికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని, వారి ప్రయాణం మరింత సులభం అవుతుందని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ టెర్మినల్ లో అత్యాధునిక సౌకర్యాలు, ఆధునిక సాంకేతిక టెక్నాలజీ ఉంటుందని పేర్కొన్నారు.

## ప్రాణాలు కోల్పోతే రూ. 5 లక్షలు నష్టపరిహారం అన్యాయం



మొదటి పేజీ తరువాయి
హోదాలో రేవంత్ రెడ్డి గారే వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు మీరిచ్చిన మాటను నిలబెట్టుకొని రూ. 25 లక్షలు పరిహారం ప్రకటించండంటూ కేటీఆర్ డిమాండ్ చేశారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన అవసరముందని అన్నారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు కూడా ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే అంతకన్నా మోసం మరొకటి ఉండదు సీఎంపై విరుచుకుపడ్డారు. అదే విధంగా వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన, డ్యామేజ్ అయిన వారికి రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు సాయం చేస్తామన్నారని, ఆ హామీని కూడా నేరవేర్చండని కేటీఆర్ అడిగారు. ప్రభుత్వ అసమర్థత, చేతగానితనం, ముందస్తు ప్రణాళిక లేకపోవటం కారణంగానే ప్రాణనష్టం జరిగిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజల ప్రాణాలు రక్షించేందుకు చర్యలు చేపట్టి వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు భరోసా కల్పించండంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

## వర్షాలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు విచారం

మొదటి పేజీ తరువాయి
తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వ్యక్తిగత పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధులకు రూ. ఐదు లక్షల చొప్పున సహాయం అందజేస్తున్నట్లు వెంకయ్య నాయుడు ప్రకటించారు. కుండ పోత వర్షాలు, ఉధృతమైన వరదలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వాటిల్లుతున్న నష్టం తనను తీవ్రంగా కలచివేసింది అని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీకి ఫోన్ చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాను. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఇప్పటికే మాట్లాడానని, అక్కడి ప్రభుత్వాల యంత్రాంగాలతో, కేంద్ర అధికారులు టచ్‌లో ఉన్నారని ప్రధానమంత్రి చెప్పారు. రెండు రాష్ట్రాలకు తగిన సహాయ సహకారాలు అందజేస్తామని ప్రధానమంత్రి హామీ ఇచ్చారని మాజీ ఉప రాష్ట్రపతి తెలిపారు. నా వంతు సహకారంగా నా వ్యక్తిగత పెన్షన్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. ఐదు లక్షలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. ఐదు లక్షలు, సహాయ చర్యల నిమిత్తం పంపించాను. ఈ కష్టకాలంలో ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. యువత కూడా పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సహాయక చర్యల్లో పాల్గొవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మా కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరపున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేశారు.

మా కుమార్తె దీపా వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేసినట్లు వెంకయ్య నాయుడు తెలిపారు.

## సీజనల్ వ్యాధుల కట్టడిపై మంత్రి దామోదర సమీక్షా సమావేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): సీజనల్ వ్యాధుల కట్టడిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. సీజనల్ వ్యాధులు (డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా ) కట్టడిలో భాగంగా రాష్ట్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ స్థాయి నుంచి అన్ని ఏరియా ఆసుపత్రుల వరకు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వరకు అన్ని స్థాయి ఆస్పత్రులలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, డయాగ్నస్టిక్ సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సిబ్బంది సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1 కోటి 63 లక్షల 73 వేల 729 ఇళ్లలో జ్వర సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. జ్వర సర్వేలో భాగంగా 5 కోట్ల 3 లక్షల 5వేల 231 మంది రక్త నమూనాలను పరీక్షించినట్లు మంత్రి తెలిపారు. జ్వర సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 2,93,371 మంది సీజనల్ వ్యాధుల బారిన పడిన బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందించడం జరిగిందన్నారు. రాజకీయాల కోసం సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయటం మానుకోవాలన్నారు. గత 10 సంవత్సరాలలో సీజనల్ వ్యాధుల బారిన పడిన బాధితుల వివరాలను పరిశీలించిన అనంతరం ట్విట్టర్‌లో కామెంట్లు చేస్తే మంచిదని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.

## నిండుకుండలా హుస్సేన్‌సాగం

మొదటి పేజీ తరువాయి
హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి, బుల్కాపూర్ నాలాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు హుస్సేన్ సాగర్ లోకి వచ్చి చేరుతోంది. ఈ వరద నీటితో హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎఫ్‌టీఎల్‌కు చేరుకోవడంతో ఇప్పటికే అధికారులు నాలుగు గేట్లు ఎత్తి దిగువన ఉన్న మూసీ నదికి నీటిని వదిలారు. దీంతో సిటీ ప్రజలకు జీహెచ్ఎంసీ ఆదివారం నుంచి అలర్ట్ జారీచేస్తోంది. హుస్సేన్ సాగర్ వరద నీటి పరిస్థితిని జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం దంచికొట్టింది. గచ్చిబౌలిలో అత్యధికంగా 97 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ అధికారులు వెల్లడించారు. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## స్మిత సబర్వాల్‌పై చర్యలకు హైకోర్టులో పిటిషన్

మొదటి పేజీ తరువాయి
వ్యక్తం అయ్యాయి. అత్యున్నత పదవిలో ఉండి స్మితా సబర్వాల్ ఇలా వ్యాఖ్యానించడం సరికాదంటూ పలువురు రాజకీయ నేతలు, మేధావులు సైతం ఆమె వ్యాఖ్యలను తప్పుబట్టారు. చివరకు స్మితా చేసిన వ్యాఖ్యలు తెలంగాణకు హైకోర్టు వరకు చేరాయి. వికలాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. స్మితా సబర్వాల్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేయడంతో దివ్యాంగులపై కాంట్రవర్సీ కామెంట్స్ ఇష్యూలో స్మితాకు భారీ ఊరట దక్కింది.

## 11 జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి
అన్నారు. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే విషయం జిల్లా కలెక్టర్లే నిర్ణయించుకోవాలన్నారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల గేట్లను తెరవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్ కలెక్టర్‌ను ఆదేశించారు.

## దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

మొదటి పేజీ తరువాయి
తన సభ్యత్వం పునరుద్ధరణకు సంబంధించిన సర్టిఫికేట్‌ను మోదీ స్వీకరిస్తారు. ఈరోజు నుంచి నవంబరు 10 వరకు దశలవారీగా డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ మెంబర్‌షిప్ డ్రైవ్ మొదటి దశ ఈ నెల 25వ తేదీతో ముగుస్తుంది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలు మినహా దేశవ్యాప్తంగా సభ్యత్వం డ్రైవ్‌లో భాగంగా కనీసం పది కోట్ల మంది కొత్త సభ్యులను చేర్చుకోవాలని బిజెపి లక్ష్యంగా పెట్టుకున్నట్లు మా ప్రతినిధి నివేదించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# ప్రకృతిని కాపాడుతున్న యోధ రేవంత్!

'పిల్లి నలుపా, తెలుపా అని కాదు.. ఎలుకను పట్టిందే పిల్లి' అని చైనా నేత డెంగ్ జీపింగ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ధైర్యసాహసాలతో హైదరాబాద్ మహానగరంలో తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలైన చెరువులు, జలాశయాల ఆక్రమణలకు ముగింపు పలికే చర్యలకు పూనుకున్నారు. దీంతో ఆయన ఇమేజ్ ఆకాశమంత ఎత్తుకు ఎదిగింది. ఈ సంగతి బిఆర్ఎస్ నాయకులు కూడా పరోక్షంగా ఒప్పుకుంటున్నారు. కానీ బహిరంగంగా చెప్పలేరు. తాము విఫలమైన పనులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే చేపట్టడం బిఆర్ఎస్ నాయకత్వానికి భారీ షాక్! అసాధ్యమైన సవాళ్ళను స్వీకరించలేనివాళ్ళు ఎప్పుడూ గొప్పవారు కాలేరు. పాత పంథాను సమూలంగా నిర్మూలించి కొత్త పంథాను ఎంచుకోవాలి. పాము తన కుబుసాన్ని విడిచిన విధంగానే వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు వెళితేనే సక్సెస్ సాధ్యమవుతుంది.రాజకీయాల్లో 'ప్రధాన విలన్'ను దెబ్బకొట్టాలంటే ముందుగా మానసికంగా గందరగోళపరచాలి. బలహీనపరచాలి. దాంతో సహజంగానే ప్రత్యర్థులు ఆత్మరక్షణలో పడిపోతారు. దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటారు. ఈ ఫార్ములాను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్షరాలా అనుసరిస్తున్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని గంభీరంగా ప్రసంగాలు చేసిన గత పాలకులు గ్రేటర్ హైదరాబాద్‌లోని చెరువులు, జలాశయాల కబ్జాను నిర్లక్ష్యం చేశారు. లేదా కబ్జాదారులతో లాలూచీపడ్డారన్న అపకీర్తిని మూట కట్టుకున్నారు. రేవంత్ రెడ్డి చర్యల వల్ల తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ వేలు పెట్టలేని వ్యవహారంలో తలదూర్చి, ఎన్నో వివాదాలు, న్యాయపరమైన చిక్కులు చుట్టుముడతాయని తెలిసీ, తన కుటుంబ సభ్యులు, సొంత మనుషులు, స్వపరివారం, కేబినెట్ సహచరులు, కాంగ్రెస్ నాయకులు%ౌ% ఎవరు భూకబ్జాలకు, చెరువుల కబ్జాలకు పాల్పడ్డా రాజకీయాలకు అతీతంగా శషభిషలు లేకుండా 'హైడ్రా' క్షిపణితో కూల్చివేస్తుండడం తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితర నేతలు, యావత్తు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డికి నైతిక బలాన్ని ఇస్తున్నారు. కాంగ్రెస్‌లో ఇదొక శుభ పరిణామం. హైదరాబాద్ నగరంలో, శివారు జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించకపోవడానికి, కెసిఆర్‌ను ఆదరించడానికి సెటిలర్లే కారణం. అయితే 'హైడ్రా' చర్యలతో హైదరాబాద్ చుట్టూ నివసిస్తున్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద వర్గాల్లో రేవంత్ రెడ్డికి విపరీతమైన 'గ్లామర్' వచ్చింది.

'చెరువుల ఆక్రమణ గత పదేళ్ల క్రితమే మొదలయినట్టు కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయి.కానీ ఇరవై ఏళ్ల క్రితం ప్రముఖ పరిశోధనా సంస్థ 'సెస్'లో మిత్రుడు, ప్రొఫెసర్ రామచంద్రయ్య సేకరించిన వివరాల ప్రకారం 1990 తరువాత వలసలు పెరిగి, చెరువులు ఆక్రమణకు గురయ్యాయి.

నిజానికి హైదరాబాద్ చెరువులతో విలసిల్లిన నగరం. ఈ నగరానికి పునాదివేసిన కుతుబ్ షాహీ రాజులు 1534- 1724 మధ్యకాలంలో సహజ సిద్ధమైన చెరువులను కాపాడుతూ వచ్చారు. తరువాత వచ్చిన అసఫ్ జాహీ పాలకులు 1724- 1948 మధ్య ఫ్రెంచ్, బ్రిటీష్, ఇండియన్ ఇంజనీర్ల సహకారంతో వందలాది కొత్త చెరువులు నిర్మించారు. హుస్సేన్ సాగర్, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్, మీరాలం చెరువులను తాగునీటి కోసం నిర్మించారు. 1960 -70 ల దాకా కాలువల ద్వారా నీళ్లు పారేవి. 1985 తరువాత కోస్తా వలసలు మొదలయ్యాయి. 2000 సంవత్సరం నాటికి ఈ వలసలు వంద రెట్లు పెరిగి చెరువులు తరగడం మొదలయ్యింది. కొత్తగా రియల్ ఎస్టేట్ అనే కొత్త జాతి వెలుగులోకి వచ్చి పఠాన్ చెరువు, అమీన్‌పూర్ చెరువు మొదలు దుర్గం చెరువు, పేరం చెరువు, సరూర్‌నగర్ చెరువు, సఫిల్‌గూడ చెరువు, యూసఫ్‌గూడ చెరువు.. ఇలా వందలాది చెరువుల చుట్టూ వేలాది ఎకరాలను కబ్జాచేసి, ప్లాట్లు వేసి కొత్త కాలనీలను కట్టేసింది. అప్పటి ప్రభుత్వం దీనిని ప్రోత్సహించింది. చంద్రబాబునాయుడు కాలంలో ప్రభుత్వమే కనీసం పది పెద్ద చెరువులను పూడ్చి పార్కులుగా మార్చేసి క్రిమినల్ చర్యలకు పాల్పడింది. చాచా నెహ్రూ పార్కు, కృష్ణకాంత్ పార్క్, సఫిల్‌గూడ పార్క్, సరూర్‌నగర్ పార్క్ అలా వచ్చినవే. అప్పుడు మొదలైన కబ్జాలు ఇప్పుడు చెరువులను పూర్తిగా మింగేసే స్థాయికిచేరాయి. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ ఆక్రమణలు పూర్తిగా తొలగించి చెరువులను శుద్ధి చేస్తే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారు' అంటూ టీఎస్పీఎస్సి మాజీ చైర్మన్, మిత్రుడు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. ఆయన ఉద్దేశంలో 1. పదేళ్ల కిందట కబ్జాలు మొదలు కాలేదు. 2. కోస్తాంధ్ర ప్రాంతాల నుంచి భర్తీ వలసలు. 3. రియల్ ఎస్టేట్ సంస్థలు వందలాది చెరువులను చెరబట్టాయి. 4. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రభుత్వమే ఈ క్రిమినల్ చర్యల్ని ప్రోత్సహించింది. చక్రపాణి పరిశీలన, వాదనలతో అందరం ఏకీభవించాలన్న రూల్ ఏమీ లేదు. గత ప్రభుత్వ హయాంలోనే చెరువుల కబ్జాలు జరగలేదని, అదివరకే జరిగిందని, అదంతా తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు హయాంలోనే ప్రారంభమైందని పరోక్షంగా చెప్పడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తోంది. 'ఆ పాపం'తో కేసీఆర్‌కు, ఆయన పాలనకు సంబంధం లేదని కూడా సందేశం ఇస్తున్నట్టు భావించాలి. 'లంకలో పుట్టిన వాళ్ళంతా రాక్షసులు' అని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చిన, 'తెలంగాణ ప్రజల పొట్టకొట్టే వారి' గురించి మాట్లాడినవారెవరు? తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష జ్వాల ఆరిపోకుండా నిరంతరం ఆజ్యం పోసింది ఎవరు? కోస్తాంధ్ర వలసలపై విషం కక్కింది ఎవరు? తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలన పగ్గాలు చేపట్టిన నేతలు పదేళ్ల పాటు హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల గురించి ఎందుకు దృష్టి పెట్టలేదు? రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపార సామ్రాజ్యాలు 2014 కు ముందు, 2014 తర్వాత కూడా తెలంగాణేతరుల చేతుల్లోనే ఎలా విలసిల్లాయి? ఐ.టి. రంగం విస్తరణ, పబ్బుల సంస్కృతి, డ్రగ్స్, ఆకాశమంత ఎత్తున భవంతులు, ఫ్లై ఓవర్లు ఎవరి హయాంలో జరిగాయి? ఎవరు వాటిని ప్రోత్సహించారు? కోస్తాంధ్ర, రాయలసీమ కాంట్రాక్టర్లకు, నిర్మాణ సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టింది ఎవరు?

# భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోవాలి: సిపిఐ



అమరచింత, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లాలో భారీ వర్షాలకు నష్టపోయిన పేద కుటుంబాలను రైతులను ఆదుకోవాలని అమరచింత మండల కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, అబ్రహం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ ప్రభుత్వాన్ని కోరారు. అమరచింత మండలం కొంకలోని పల్లిలో సిపిఐ శాఖ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 14 మండలాలు ఉన్నాయని, ప్రతి మండలంలోనూ భారీ వర్షాలకు పదుల సంఖ్యలో ఇల్లు కూలిపోయాయని, కూలిన ప్రతి ఇంటికి రూ. 25వేల నగదు, 20 కిలోల బియ్యం, వంట పాత్రలు బట్టలు ఇవ్వాలని కోరారు. ఇప్పుడే వరి నాట్లు వేశారని భారీ వర్షాలకు కొన్ని నీట మునిగాయని, మరికొంత కొట్టుకుపోయి రైతులకు నష్టం వాటిలిందన్నారు. వేరుశనగ, మినుము విత్తనాలు వేశారని భారీ వర్షాలకు అభిమాలకెత్తలేదు అన్నారు. మెట్ట పంటలు పాడయ్యాయన్నారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి కనీసం రూ. 20వేల సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వానల వల్ల రోజు కూలి చేసుకొని బతికే వారికి పని లేక పొట్ట గడవని పరిస్థితి ఉందని, ప్రతి ఇంటికి 25 కిలోల బియ్యం ఇవ్వాలని కోరారు. వర్షాలకు పైపుల లీకేజీల వల్ల తాగు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని , దీనివల్ల వివిధ రకాల జబ్బులు, అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేష్, నాయకులు అంజి, వెంకటేష్, కృష్ణయ్య, శీను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాలను పరిశీలించిన మక్తల్ ఎమ్మెల్యే





ఆత్మకూరు, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో కృష్ణా నది పరివాహ ప్రాంతాల్లో జూరాల ప్రాజెక్టు కింద పలు గ్రామాలలో మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి నదీ ప్రవాహాన్ని అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు, మత్స్యకారులు గొర్రెల కాపర్లు, పశువుల మేతకు వెళ్లేవారు ఎవరు కూడా కృష్ణ నది వైపు వెళ్లకూడదని సూచనలు జాగ్రత్తలు తెలిపారు. చెరువుల కుంటలు బావులు పుష్కలంగా కలదుతున్నాయని ప్రతి ఒక్క రైతు కూడా సంతోషంగా పంటలు పండించాలని నీటిని వృధా పోనీయకుండా లిఫ్టులలో బావుల్లో నిల్వ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. వీరి వెంట ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయచూరు పరమేష్, మాజీ మండల అధ్యక్షులు రహమతుల సీనియర్ నాయకులు మొగిలి గంగాధర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు, పిన్నంచర్ల మాజీ సర్పంచ్ మచ్చేందర్ గౌడ్, జూరాల మాజీ సర్పంచ్ మహమూద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**– ఇంటింటికీ తిరిగి చెక్కులు పంపిణీ చేసిన నాయకులు**



పెబ్బేరు, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య ఆధ్వర్యంలో ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి బెరికి లక్ష్మణ్,కటికల బీసన్న,పిట్ట నాగేంద్రం ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు చెక్కులను అందుకున్నారు. నిధులు మంజూరు చేయించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులను లబ్ధిదారులకు ఇంటివద్ద అందజేయడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేలా కృషి చేస్తామని,ఆపదలో ఉన్న అభాగ్యులకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. నిరుపేద కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆపద్బాంధవుడయ్యారని పేర్కొన్నారు. ఆపద సమయంలో వైద్య ఖర్చుల కోసం బాధిత కుటుంబాలకు సీఎం అందజేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజు గౌడ్,రామాంజనేయులు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

# పవన్ కళ్యాణ్ జన్మదిన ఘనంగా వేడుకలు



నేరేడుచర్ల, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్: హుజుర్నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వరావు ఆధ్వర్యంలో 56 కేజీ ల కేక్ తో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. పుట్టినరోజు వేడుకల సందర్భంగా స్థానిక ప్రధాన కూడలి లో కేక్ కట్ చేయడం జరిగింది, అదే విధంగా నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల మాల ధరించిన, వారికి మరియు జనసైనకులకి అన్న దానకార్యక్రమం నిర్వహించడం జరిగింది, తెలంగాణ లో కూడా రాబోయే రోజుల్లో జనసేన పార్టీ బలోపేతం అవ్వాలని కోరుకుంటూ పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కొమ్మ రాజు శ్రీను, సాయి చరణ్, కీసర నరేష్, చారి నాగ, మధు, యశ్వంత్, చందు, రాకేష్, అంజి, ఫహీం, వెంకన్న, కాలం సైదులు, రాంతుల్లా మొదలగు జనసైనికులు పాల్గొన్నారు.

# వైఎస్ సేవలు చిరస్మరణీయం

**♦ ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు**



పెబ్బేరు, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు చిరస్మరణీయమని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. పెబ్బేరు పట్టణంలోని సోమవారం స్థానిక సుభాస్ చంద్రబోస్ చౌరస్తాలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. విద్య, వైద్య రంగాలలో వైఎస్సార్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు.వైఎస్సార్ ఓ ప్రభంజనం అన్నారు. రాజశేఖర్ రెడ్డి నవ్వులో స్వచ్ఛత, పిలుపులో ఆత్మీయతలు వుంటాయని కొనియాడారు. మాట తప్పని, మడమ తిప్పని గుణంతో వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. అయితే ఆ జ్ఞాపకాలు నేటికీ ప్రజల హృదయాల్లో చెరిగిపోలేదన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్ సాగర్, ఎస్సీ సెల్ నాయకులు గంధం రంజిత్ కుమార్, మాజీ సర్పంచులు సురేందర్ గౌడ్, రవీందర్ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య,కౌన్సిలర్ ఎల్లస్వామి, నాయకులు యుగంధర్ రెడ్డి,దయాకర్ రెడ్డి, రామిరెడ్డి, సర్వేశ్, సత్యనారాయణ, శివాసాయి, నరసింహనాయుడు, ధారపోగు వెంకటేష్, బెర్కి లక్ష్మణ్, పిట్ట నాగేంద్రం, మాజీ డైరెక్టర్ రాములు, వడ్డే అంజి, మల్లేష్ యాదవ్, తిరుపతయ్య సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యధిక వర్షపాతం వలన ఉద్యాన పంటలకు నష్టం



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): సోమవారం జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని నాంచారిమడూరులో బొప్పాయి తోట, నష్టపోయిన పంటలను పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వరదల వలన ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని అందులో ముఖ్యంగా 30 ఎకరాలలో బొప్పాయి తోట నేలమట్టం అయినదని మరియు వివిద గ్రామాలలో సుమారుగా 675 ఎకరాల మిరప తోట మరియు పసుపు ముంపునకు గురి అయి%శీ%దని తెలిపారు.

# వైయస్సార్ సేవలు చిరస్మరణీయం



**– మూలమలలో వైయస్సార్ 15వ వర్ధంతి వేడుకలు**

ఆత్మకూరు, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు అనంతరం ఆయన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంపీటీసీ లక్ష్మన్న, గ్రామ యూత్ ప్రెసిడెంట్ ఏ.సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అద్దాల వెంకటన్న, ఉషన్న కురువ రాజు, కాసిం, ఆనంద్ శేఖర్, కావలి సూరి, ముష్టి శ్రీనివాసులు, బుచ్చన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్ సేవలు మరువలేనివి

**వైయస్సార్ 15వ వర్ధంతి వేడుకలు**



నర్వ, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలు నర్వ మండలం పాతర్ చెడ్ గ్రామంలో వైఎస్ఆర్సిపి నాయకులు కర్ని గంగాధర్ ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకులు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన ఆయన సేవలను కొనియాడారు. ఆయన అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు నేటికీ తెలుగు రాష్ట్రాలలో కొనసాగుతున్నాయని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ నాయకులు మైబు నాగరాజు రెడ్డి,ఎల్లప్ప,రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశ లింగం పార్థివ దేహానికి నివాళులు





ఆత్మకూర్, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం జూరాల గ్రామానికి చెందిన టీచర్ ప్రకాశం లింగం అనారోగ్యం వల్ల సోమవారం రోజు మృతి చెందారు విషయం తెలుసు కున్న మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర మక్తల్ నియోజకవర్గం తొలి శాసనసభ్యులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రాగడ సానుభూతి తెలియజేశారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): గణపతి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహణపై పోలిస్, రెవెన్యూ, పంచాయితి రాజ్, విద్యుత్, మున్సిపాల్టీ, మత్స్యశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. గణపతి నిమజ్జనం జరిగే చెరువులు, వాగులు, గోదావరి నది వద్ద పోలిస్ శాఖ తరుపున పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు, త్రాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. అవసరం మేరకు తాత్కాలిక సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. మత్స్య శాఖ ద్వారా గజ ఈత గాళ్ళను ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అంబులెన్స్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ద్వారా గణపతి మండపాలకు విద్యుత్ అనుమతులు జారీ చేయాలని, విద్యుత్ తీగలు కింద, విద్యుత్ స్తంభాలు ప్రక్కన మండ్పాలను ఏర్పాటు చేయకుండా నియంత్రణ చేయాలని అన్నారు. రెవెన్యూ, పంచాయితి కార్యదర్శుల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు గణపతి నవరాత్రి ఉత్సవాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కాళేశ్వరం గోదావరి వద్ద వినాయక ప్రతిమలు నిమజ్జనం జరిగే చోట క్రేన్ లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని అన్నారు. మండపాల నిర్వహకులకు నిమజ్జన ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించుటకు ప్రజలు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మండపాల వద్ద ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యర్ధాలు వేసేందుకు తప్పని సరిగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, మత్స్య శాఖ అధికారి అవినాష్, అదనపు ఎస్పి బోనాల కిషన్, ఆర్డీవో మంగిలాల్, డిఎస్పీలు, సిఐలు, తదితరులు పాల్గొన్నారు.

# తేలికపాటి వర్షాలకు రోడ్లపై నీళ్లు ఆగొద్దు

## నాళాలు మూత పడేలా నిర్మాణాలు చేపట్టవద్దు

## సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులకు ఎమ్మెల్యే నాయిని సూచనలు



హన్మకొండ జిల్లా, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): తేలికపాటి వర్షాలకు సైతం ప్రధాన రహదారుల వెంట నీరు నిలువకూడదని, నాళాలు బహిరంగంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్న వరంగల్ మహానగరంలో వర్షాల ప్రభావంతో చిన్నచూపు కావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 9న ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో బాలసముద్రం ప్రధాన రోడ్డును కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు , ఎన్హెచ్ డీ కిరణ్ (నేషనల్ హై వే) కుడా ఈఈ భీమ్ రావు, పీసీసీ మెంబర్ బట్టి శ్రీనివాస్ రావు మరియు అధికారులతో పరిశీలించారు. నిర్మాణం చేపట్టే ప్రతి పనిలో శాశ్వత పరిష్కారం ఉండేలా పనులు జరగాలని తెలిపారు. ప్రధాన రోడ్ల పక్కన ఉన్న నాళాలు (సైడ్ డ్రైన్) లు బహిరంగంగా ఉండేలా చూడాలని, దుకాణ సముదాయాల యాజమాన్యానికి కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

### యుద్ధప్రాతిపదికన బీటి రోడ్డు పనులు చేపట్టాలి

పోలీస్ హెడ్ క్వార్టర్ నుంచి యూనివర్సిటీ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా బీటి రోడ్డు నిర్మాణం త్వరగతిని పూర్తి చేయలని, బ్రిడ్జి నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుందని కోరారు. భారీ వర్షాలకు సైతం నాయిమ్ నగర్ మోరి ఆవరణలో నీరు సజావుగా సాగడం పట్ల ప్రజలకు మన ప్రభుత్వం పట్ల నమ్మకం ఏర్పడిందని, భవిష్యత్ లో ప్రధాన నాళాల్లో వర్షాలకు నీరు నిలువలు ఉండవని ఎమ్మెల్యే అన్నారు. బ్రిడ్జి నిర్మాణ ఆవరణలో సుందరికరణ పనులు, పాదచారులు మార్గం రెండు సమవుజ్జిగా కొనసాగించాలని కోరారు.

# గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

- ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి
- అధికారులకు సూచించిన కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. సోమవారం మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతిని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ముంపు ప్రాంతమైన పుసుకుపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉదృతంగా ప్రవహిస్తున్నదని, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎగువ ప్రాంతాలలో వర్షం కురిస్తే గోదావరి ఉదృతంగా ప్రవహించే అవకాశం ఉంటుందని, ముంపు ప్రాంతల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారాన్ని తనకు తెలియా పరచాలని అన్నారు. గోదావరిలోకి స్నానాలు ఆచరించేందుకు భక్తులను అనుమతించ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ సూర్య ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సిడబ్ల్యుసి సైట్ ఇంజనీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెగిన రొడ్డును పరిశీలించిన ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్ రెడ్డి



సంగెం, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సంగెం మండలం నార్లవాయి క్రాస్ రోడ్ వద్ద తెగిన తాత్కాలిక రొడ్డును సోమవారం పరకాల ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. నల్లబెల్లి, మొంద్రాయి మధ్య ఆర్ బి రోడ్ పనులు జరుగుతుండగా నిర్మిస్తున్న కల్వర్టుల కోసం నార్లవాయి క్రాస్ వద్ద తాత్కాలికంగా నిర్మించిన రోడ్ ను భారీ వర్షాలతో కొట్టుకు పోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకొని సోమవారం ఎంఎల్ఏ అక్కడికి వచ్చి సందర్శించారు అక్కడినుండి రాకపోకలకు ఇబ్బంది కాకుండా వెంటనే పైప్ లు వేసి తాత్కాలిక రోడ్ ను నిర్మించాలని, కల్వర్ట్ ల నిర్మాణం పూర్తి చేసి రోడ్ పనులు పూర్తి చేయాలని అలాగే కాట్రపల్లి, వెంకటాపురం గ్రామాల మధ్య రోడ్ తెగిన రాక పోకలు అంతరాయం ఏర్పడినట్లు తన దృష్టికి వచ్చిందని వెంటనే రోడ్ పనులు చేపాట్టి ప్రజలకు ఇబ్బంది కాకుండా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్ లకు అధికారులకు ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి ఆదేశించారు.

# ఘనంగా వైఎస్ వర్ధంతి వేడుకలు



నారాయణ్ పేట జిల్లా, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట జిల్లా లోని మక్తల్ నియోజక వర్గం పార్టీ కార్యాలయంలో నేడు స్వర్గీయ డా. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన, అనంతరం మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి గార మరియు ముఖ్య నాయకులుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషినీ, అదేవిధంగా వారు తీసుకువచ్చిన కొన్ని పథకాలు ఈ దేశానికే ఎంతో స్ఫూర్తి దాయకం అని తెలియజేశారు. వారి హయంలో ప్రారంభమైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ నేటికీ కొనసాగుతోంది అనేందుకు గుర్తుగా అమరచింత మండలంలోని తుక్యా నాయక్ తాండాకు చెందిన సవరమ్మ గారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 28,500/- రూపాయల చెక్కును స్థానిక శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అందజేశారు.

# వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని



హన్మకొండ, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): వైస్సార్ 15వ వర్ధంతి సందర్బంగా హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యేలు, కుడా చైర్మన్, డీసీసీ అధ్యక్షురాలు, సంక్షేమ పథకాలు గురించి మాట్లాడాలంటే వై.ఎస్ కి ముందు తర్వాత అని చెప్పు కోవాల్సిందేని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అద్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి కీ.శే వైస్సార్ 15వ వర్ధంతి సందర్బంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ లతో కలిసి పూలమాల వేసి, నివాళీలు అర్పించారు. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సంక్షేమ పథకాల ప్రధాత అన్నదాతల ఆత్మబంధువు అందరి ముఖ్యమంత్రి వై.ఎస్సార్, భారతదేశంలోనే అప్పటివరకు ఎవరూ చేపట్టని సాహసయాత్ర వైఎస్సార్ చేశారు. 2003లో 1,500 కిలో మీటర్ల సుదీర్ఘ యాత్ర చేపట్టారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి, ఉచిత కరెంట్ పై తొలి సంతకం, రైతులకు ఋణాలు మాఫీ. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు 2లక్షల ఆర్థిక సాయం తో తన కార్యక్రమాలను ప్రారంభించారు. ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం. పేదవిద్యార్థులకు ఫీజు రిఎమ్మెబర్సిమెంట్ ఇచ్చి ఉన్నత విద్యకు దగ్గర చేసిన మహానేత దాదాపు 30 లక్షల మందికి ఇండ్ల పట్టాలు,పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చిన మహానేత వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పెన్షన్లు పెంపు, మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చి వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి జలయజ్ఞం ద్వారా వ్యవసాయానికి నీళు అందించిన ఘనత వై ఎస్ఆర్ అని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి భౌతికంగా దూరమైనా ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, అనుబంధ సంఘాల అద్యక్షులు బంక సరళ, కూర వెంకట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బినీ లక్ష్మణ్, నాయిని లక్ష్మా రెడ్డి, నల్ల సత్యనారాయణ, తౌటం రవీందర్, హన్మకొండ్ రాజేందర్, రహీమున్నిస్సా బేగం, తాళ్ళపల్లి మేరీ, కొంటె సుకన్య, నాంపల్లి ప్రభాకర్, ఎస్. కుమార్ యాదవ్, రావుల సదానందం, మండల సమ్మయ్య, మొహమ్మద్ జాఫర్, అన్వేశ్వరపు సురేందర్, కే. సమ్మయ్య, కే. కృష్ణ, సమద్, సుగునాకర్ రెడ్డి, బి. యాదగిరి గౌడ్, మల్లం కుమార్, కొండా నాగరాజు, నిఖిల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా మైనర్ల డ్రైవింగ్

కరీంనగర్: దేశంలో మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మైనర్ డ్రైవింగ్ ల ప్రమాదాలే అధికంగా ఉన్నాయని కొన్ని సర్వేల్లో వెల్లడైంది. మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదం జరిగి ప్రాణాలు పోతున్నాయి. తీవ్ర గాయాలతో జీవితకాలం మంచాన పడ్డ వారు కూడా ఉంటున్నారు. మైనర్ డ్రైవింగ్ లో ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందితే వారికి ఇన్సూరెన్స్ కూడా ఉండదు. ఎందుకంటే మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండదు. మరి ఎన్ని సంఘటనలు జరుగుతున్నా.. నేటికీ మైనర్ల డ్రైవింగ్ సమస్యలు మాత్రం తీయడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టి సారించిన ప్రభుత్వం మైనర్ల డ్రైవింగ్ పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. మైనర్ డ్రైవింగ్ తో ఏదైనా ప్రమాదం జరిగితే వేల రూపాయల ఫైన్లు వేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఓ జీవాను జారీ చేసింది. రాష్ట్రంలో మైనర్ వాహనాల డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవరు కూడా ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్నారు. కానీ ఎన్ని ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎన్ని చట్టాలు వచ్చినా మైనర్లకు మాత్రం ఒంట్లో భయం లేకుండా పోయింది మరి ఇలా ప్రవర్తిస్తున్న వారి నిర్లక్ష్యానికి తల్లిదండ్రులే కారణమా...? లేక పోలీసులే కారణమా...? అని చర్చ మొదలైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిత్యం ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఈ మైనర్ల వికృత చేష్టలు మాత్రం మారడం లేదు. ఇళ్లలో నుంచి వాహనాలు తీసుకువచ్చి రోడ్లపై స్టన్స్ వేస్తున్నారు. తాను ప్రమాదానికి ఒక్కడే గురికాకుండా తనతో పాటు మరొక ఇద్దరిని కూడా తీసుకువచ్చి ప్రమాదానికి గురి అయ్యేలా కారణం అవుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మైనర్లు పట్టపగలే త్రిబుల్ రైడింగ్ చేస్తూ ఓవర్ స్పీడ్ తో ఇతర వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఒక స్కూటీ వాహనంపై ముగ్గురు మైనర్లు వెళ్తూ ఏబీపీ దేశం కెమెరాకి చిక్కారు. ఆ ముగ్గుర్ని మీరు ఏం చదువుతున్నారు మైనర్లు కదా వాహనాలు నడపడం ఏంటని అడగగా నిర్లక్ష్యమైన సమాధానం ఇవ్వడంతో షాక్ తిన్నారు. తాను 9వ తరగతి చదువుతున్నాను ఈ ఫోటోను తీసి పోలీసులకు పంపించాలనీ ఓ బాలుడు చెప్పాడు. మరి ఇంత విచ్చల విడిగా మైనర్లు రోడ్లపై వాహనాలతో తిరుగుతున్నారంటే దానికి కారణం ముమ్మాటికి తల్లిదండ్రులని, వారు ఇవ్వకుండా బాలుర చేతికి వాహనం ఎలా వస్తుందని అంతా అంటున్నారు. ఇలాంటి మైనర్ పిల్లలు వాహనాలు నడపటం ద్వారా ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి చిన్నారుల తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వీరి రాంగ్ డ్రైవింగ్ వల్ల ఎవరైనా ప్రాణాలు కోల్పోయినా, లేక తీవ్ర గాయాలతో శాశ్వతంగా మంచానికే పరిమితం అయితే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్న తలెత్తుతోంది.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 17 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించేందుకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నుండి జిల్లాకి సంబంధించి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు అలాగే జిల్లాస్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు నియమించాలని, దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, ఆర్డీవో మంగిలాల్, ఈ.డి.ఏం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## దంచి కొడుతున్న వానలు

## రక్షణ సూచనలు చేసిన ఎస్ఐ కిరణ్ కుమార్

తాండూర్: తాండూర్ మండలంలో ఈరోజు నుంచి మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో ఒర్రెలు పొంగి ప్రవహించే అవకాశం ఉ న్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలి అత్యవసరం అయితే తప్ప ఎవరూ కూడా బయటకు రాకూడదన్నారు.అత్యవసర సమయంలో 100 నెంబర్ కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్ 8712 656575కి ఫోన్ చేయగలరని వెంటనే తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాలలో పాత ఇండ్లు, గుడిశలలో, శిథిలావస్థలో ఉండే నివాసలలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కూలిపోయే పరిస్థితిలో ఉంటే పోలీస్ వారికి సమాచారం అందిస్తే సురక్షిత ప్రదేశాలకు తరలిస్తామన్నారు. అలాగే నది తీరా గ్రామాలలో పెద్దలు తమ పిల్లలను నదులలోకి, వాగుల వద్దకి వెళ్లకుండా చూడాలని, చేపలు పట్టే వారు చేపల వేటకు వెళ్లకూడదన్నరు. వాగులు వంకలలో కూడా నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాలలో అప్రమతంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా, విద్యుత్ వినియోగ దారులు మరియు ప్రజలు ఇంటిలో తడి చేతుల తో విద్యుత్ పరికరాలను మరియు తీగలను ముట్టుకో వద్దు ముఖ్యంగా బట్టలు ఆరేసే తీగలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలి అన్నారు. మండలంలోని వాగులన్నీ ప్రమాదకరంగా ప్రవహించే అవకాశం ఉండడంతో రోడ్లపై ఒర్రెలు వరద ప్రభావిత గ్రామాల ప్రజలు ఒర్రెలు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్కువ నీరు ప్రవహిస్తున్నప్పుడు దాటకుండా వరద ప్రవాహం పూర్తిగా తగ్గిన తర్వాతనే చూసుకుని దాటాలని సూచించారు

# గురుకుల పాఠశాలలో మళ్లీ విద్యార్థుల మధ్య ఘర్షణ




మెదక్, సెప్టెంబర్ 02: మెదక్ జిల్లా తూప్రాన్ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి 12.00 గంటలకు తొమ్మిదో తరగతి విద్యార్థులపై 10వ తరగతి విద్యార్థులు ముకుమ్మడి దాడి చేశారు.

ఈ దాడి విషయాన్ని 9వ తరగతి విద్యార్థులు.. తమ తల్లిదండ్రులకు తెలిపారు. సోమవారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు రెసిడెన్షియల పాఠశాలకు చేరుకుని... ప్రిన్సిపాల్‌తో వాగ్వివాదానికి దిగారు.

పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సరైన పర్యవేక్షణ లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సందర్భంగా ఆరోపించారు. అందుకే ఈ తరహా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని వారు ఆవేదన చెందారు.

ఇటీవల 10వ తరగతి విద్యార్థులపై కాలేజీ విద్యార్థులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ కొద్ది రోజులకే మరోసారి గురుకుల పాఠశాలలో ఘర్షణ చోటు చేసుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత జులైలో గురుకుల పాఠశాలలో జూనియర్లను గదిలో బంధించి వారిపై సీనియర్లు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. దీంతో గురుకులంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనపై పోలీసులు సైతం ఆరా తీశారు. ఈ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో పాఠశాల విద్యార్థులకు కాలేజీ విద్యార్థులకు మధ్య తరచుగా వివాదాలు నెలకొన్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా నీటి సమస్య.. అంటే విద్యార్థులు బట్టలు ఉతుక్కునే సమయంలో చోటు చేసుకున్న స్వల్ప వివాదం కాస్తా ఇలా ఘర్షణలకు దారి తీస్తుందని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు. గురుకులంలో వార్డెన్ల నిర్లక్ష్య వైఖరి కూడా ఈ తరహా ఘటనలకు కారణమని ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆది శ్రీనివాస్..

**– వరద ఉధృతిని పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



వేములవాడ: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వేములవాడ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని మూలవాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ బతుకమ్మ తేప్ప వద్ద వరద ఉధృతిని ఏఎస్పి శేషాద్రిని రెడ్డి తో కలిసి పరిశీలించారు. తిప్పపూర్ లో వర్షంతో ఇల్లు కూలిపోయిన గసికంటి ఎల్లవ్వ ను ఇల్లును పరిశీలించి తక్షణ సహాయం అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బేడ బుడగ జంగాల నివాసాల వద్దకు వెళ్లి పరిశీలించి నీట మునిగిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా, వెంటనే వారికి నిత్యవసర సరుకులు అందజేయవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, కరెంటు స్థంభాలను, వైర్లను, విద్యుత్ పరికరాలను తాకరాదని సూచించారు.

చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్ళద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పురాతన ఇళ్లలో ఉన్నవారు సురక్షితమైన ఇంట్లోకి తరలి వెళ్ళాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం గత రెండు రోజులు ముందు నుండే ఆయా జిల్లాల కలెక్టర్లకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలి.. నీట మునిగిన బుడగ జంగాల కాలనీ వాసులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తా.. బుడగ జంగాల కాలనీలో నిరాశ్రయులైన వారికి కోనయ్య పల్లి లో తాత్కాలిక పునరావస కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే హెచ్చరికలను ఆలోచన సూచనలు పాటించాలని పేర్కొన్నారు. వాగులు, ఒర్రెలు ఉద్రిక్తంగా ప్రవహిస్తున్నాయి, వాటిని దాటే ప్రయత్నంలో ప్రాణాలకు ప్రమాదం ఉంది, కావున వాటిని దాటా కూడా ఉండాలని విజ్ఞప్తి చేశారు. చెరువులు, కుంటలు నిండి అలుగులు దునుకుతున్న తరుణంలో చేపల వేటకు వెళ్లే వారు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలి. గతంలో ఇలాంటి చర్యలు అందించారో దానికంటే మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వం ముందుకు పోతుంది.. వరద ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించాం అని అన్నారు.

నియోజకవర్గ ప్రజల ఏదైనా అత్యవసర పరిస్థితులు, ఘటనలు, వాగులు తెగిన వివిధ సమస్యలపై పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులకు, గ్రామాల్లో ఉన్న స్థానిక అధికారులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయన వెంట పట్టణ సీఐ వీరప్రసాద్ , మున్సిపల్ కమిషనర్ డి సంపత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ ,కౌన్సిలర్లు, నాయకులు కనికరపు రాకేష్, చిలక రమేష్, సయ్యద్ సాబీర్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 2: రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలెర్ట్ ఉన్నదని యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా తెలిపారు. వర్షాలు, వరదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన రెండు రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నామని, రానున్న రెండు రోజులు ఇదే స్పూర్తితో అప్రమత్తంగా ఉండాలని ఈ రెండు రోజులు చాలా ముఖ్యమని అన్నారు. మండల స్టాయిలో రెవెన్యూ, పంచాయతి, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షం ఎపుడు వస్తుందో తెలీదని ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాగులు, రహదారులపై నీళ్ళు వస్తే ప్రయాణాలు నియంత్రణకు ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలల్లో పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ముంపు గ్రామాల జాబితాను సిద్దం చేసుకుని తగు జాగ్రత్తలు పాటించే విధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా లూజు వైర్లు గుర్తించి ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. నిండు కున్న జలాశయాలకు వీక్షణకు ప్రజలు వస్తుంటారని నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పొంగే వాగులు, రహదారులపై వాహనాలు రాకపోకలు నియంత్రణ చేయాన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్ నందు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదేని అత్యవసర సేవలకు ప్రజలు కంట్రోల్ రూము నంబర్స్ కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. ప్రసవానికి దగ్గర తేదీ ఉన్న మహిళలను ఆసుపత్రులకు తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. 102, 104 వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కాళేశ్వరానికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతి, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు తక్షణమే సాయం అందించాలి

**– రావిరాల గ్రామంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత**

**– జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శి ఆశోద భాస్కర్**



నెల్లికుదురు: వరద ముంపుతో తీవ్రంగా నష్టపోయిన మండలంలోని రావిరాల గ్రామస్తులను అన్ని విధాలుగా తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ మాల మాహనాడు జాతీయ కార్యదర్శి ఆశోద భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం రావిరాలకు ముంపు ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన మంత్రి సీతక్కకు మండల అధ్యక్షులు కారం ప్రశాంత్ తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ఆయన మాట్లాడుతూ తొలుత భారీ వర్షాలకు జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడిన మాల మాదిగ బీసీ కాలనీ లలో గల కుటుంబాలను ఆయన సందర్శించారు. ఎక్కువ శాతం దళిత బలహీనవర్గాల వారికే తీవ్ర నష్టం వాటిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, తీవ్ర వరదతో నేలమట్టమైన ఇండ్ల స్థానంలో వెంటనే ఇండ్లు మంజూరు చేసి ప్రభుత్వమే నిర్మించాలని అన్నారు. కొట్టుకపోయిన రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టి, శాశ్వత పనులకు శ్రీకారం చుట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నెల్లికుదురు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ మండల మీడియా ఇంచార్జీ మండలి శ్రీకాంత్ గ్రామ అధ్యక్షులు అరె ఐలయ్య గార రామచంద్రు తదితరులు పాల్గొన్నారు

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు సరికాదు

**– సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసనల్లో నాయకులు**




హైదరాబాద్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు సరికాదని పలు కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. ప్రపంచంలో శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరు ఈ దాడులను వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా వద్ద సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసనలు చేపట్టారు. ఉక్రెయిన్, పాలస్తీనాపై అమెరికన్ సామ్రాజ్య వాదం అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష దమనకాండను, యుద్ధోన్మాద వైఖరిని నిరసిస్తూ అంతర్జాతీయ కార్మికవర్గ స్ఫూర్తితో సెప్టెంబర్ ఒకటిన దేశవ్యాప్తంగా అంతర్జాతీయ యాక్షన్ డే నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంలో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో సామ్రాజ్యవాద నిరసనలు నిర్వహించారు. ఈ నిరసనల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1946 నుంచి పాలస్తీనియన్ల భూభాగాలను బ్రిటన్-అమెరికన్ సైన్యాలు ఆక్రమించుకున్నాయని తెలిపారు. అనంతరం బ్రిటన్, రష్యా, అమెరికా తదితర దేశాల్లోని యూదుల్ని పాలస్తీనా భూభాగంలోకి చొప్పించడంతో గత 80 ఏండ్లుగా అనేక రూపాల్లో యుద్ధం కొనసాగుతున్నదని చెప్పారు. పశ్చిమ ఆసియా (మధ్య ప్రాచ్యం)లో ఉన్న అత్యంత విలువైన ఇంధన నిల్వలపై తమ పెత్తనాన్ని నిలబెట్టుకోవడానికి యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీని పర్యవసానంగా పాలస్తీనియన్లు నిత్యం అభద్రతలో బ్రతకాల్సి వస్తున్నదనీ, అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధకాంక్షకు వారు బలవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర సీనియర్ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జె.వెంకటేష్, ఎస్.రమ, ఎం.పద్మశ్రీ, శ్రీకాంత్, కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సుధాకర్, వై.సోమన్న, ఎ.సునీత, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అనురాధ, హైదరాబాద్ నాయకులు శివబాబు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజరు కుమార్ యాదవ్, ఏఐటీయూసీ హైదరాబాద్ సిటీ కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, నాయకులు సీహెచ్.జంగయ్య శ్రీను, అనిల్, సీజీ కన్ఫడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.నాగేశ్వర్రావు, ఏఐడబ్ల్యూటీయూ నాయకులు జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# విషాదం మిగిల్చిన వర్షం..

**రెండు ప్రాణాలను మింగేసిన ప్రమాదం...**

**మోతిలాల్ మృతదేహం లభ్యం.**

ఖమ్మం: బిడ్డ అశ్వినిని శంషాబాద్ విమానాశ్రయంలో దింపేందుకు తండ్రి మోతిలాల్ ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గేట్ కారేపల్లి శివారు గంగారం తండా నుండి ఆదివాచం తెల్లవారు జామున కారును తానే నడుపుతూ ఆనందంగా బయలుదేరాడు. రిన మోతిలాల్.

కూతురు యువ శాస్త్రవేత్త కుమారి అశ్విని సాయంత్రం శంషాబాద్ నుండి విమానంలో బయలుదేరి ఈరోజు చత్తీస్ గడ్ రాష్ట్రంలోని రాయపూర్ లో జరగనున్న జాతీయ స్థాయి సైన్స్ సెమినార్ లో ప్రసంగించాల్సి ఉంది. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి పై నుంచి వర్షపు నీరు పోతుండడంతో వరద తీవ్రతతో, మరే కారణమోకానీ.., నిన్న ఉదయం ఆకేరులో వారి కారు పడిపోయింది. తాము వాగులో పడి పోయామని, మెడలోతు నీళ్ళలో ఉన్నామని బోరున విలపిస్తూ సమీప బంధువులకు తండ్రి, కూతురు ఫోన్లు చేసారు. తరువాత కాసేపట్లో ఫోన్లు స్విచ్చాఫ్ అయ్ఆయయి. కారు కనిపించకుండా పోయింది.

పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అశ్విని మృతదేహాన్ని, కారును ఆదివారమే బయటకు తీసారు. సోమవారం ఉదయం మోతిలాల్ మృత దేహన్ని గుర్తించారు

# దుర్వాసన నుండి కాపాడండి మహాప్రభో

**– రైతుల పాలిట యమపాశంగా పౌల్ట్రీ హాచరీస్**

**– వరి పంటపై తెప్పలుగా కోళ్ల మలం, కెమికల్స్**

**– ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు**



రాయపర్తి: శ్రీ సత్యనారాయణ స్వామి పౌల్ట్రీ హాచరీస్ నుండి వచ్చే దుర్వాసన, కోళ్ల మలం, కెమికల్స్ నుంచి తమను కాపాడండి మహాప్రభో అని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రం శివారులోని మంచినీళ్ల చెరువు సమీపంలో నిర్మించిన శ్రీ సత్యన్నారాయణ స్వామి హాచరీస్ తమ పాలిట యమపాశంగా మారిందని సోమవారం బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌల్ట్రీ హాచరీస్ కోళ్ల మలాన్ని ఎస్సారెస్పీ కాలువ వెంబడి కుప్పలు తెప్పలుగా వేయడంతో ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తుందని బాధపడుతున్నారు. కోడి వ్యర్థాలపై కొంగలు వాలి పంటనంత నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఏంటి అని ప్రశ్నిస్తే పౌల్ట్రీ హాచరీస్ ఓనర్ మీ భూములు అమ్మండి కొనుగోలు చేస్తా అని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిపారు. దుర్వాసన కారణంగా వ్యవసాయ కూలీలు కూడా రావడం లేదని దాంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వ్యాఖ్యానించారు. కెనాల్ కాలవ వెంబడి ఉండే దారి హాచరీస్ నుండి వచ్చే వాహనాల కారణంగా గుంతల మయం అయ్యిందని ఆధారాలతో చెబుతున్నారు. వర్షాలలు వస్తే కోళ్ల మలం పంట పొలాలను నాశనం చేయడమే కాకుండా నేరుగా వెళ్లి మంచినీళ్ల చెరువులో కలుస్తుందని తెలిపారు. అధికారులు పౌల్ట్రీ హచరీస్ నుండి తమను కాపాడాలని వేడుకుంటున్నారు. ఈ ఆందోళనలో కుంట రాజు, గుగులోత్ చోక్ల నాయక్, కుంట రాజు, కుంట హనుమంత్, యాకుబ్, దేవా, కుంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నేవీ ప్రైయివేట్ ఉద్యోగి అడ్రస్ ఎక్కడ ?

**– ఏడాదిగా పట్టించుకోని అధికారులు..**

**– బండి సంజయ్ ని ఆశ్రయించిన బాధిత కుటుంబం**



తాడ్వాయి : ములుగు జిల్లా తాడ్వాయి మండలం బైయక్కపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుర్రం రమ సమిరెడ్డి ల కుమారుడు గుర్రం శ్రీమాన్ (24) గత సంవత్సరం నవంబర్ 22, 2023 రోజున ఇరాన్ దేశంలో ప్రైవేట్ నేవీ ఉద్యోగంలో చేరాడు. శిక్షణ అనంతరం, నెల తర్వాత డిసెంబర్ 23 నాడు ఆయన విధులు నిర్వహించే షిప్ (పడవ) గల్లంతైనట్టు తెలిపారు. అప్పటినుండి ఇప్పటివరకు శ్రీమాన్ మృతదేహం, కానీ ఆనుబాలు గాని తెలుపలేదు. అక్కడి నేవీ అధికారులను అడగగా శ్రీమాన్ చావలేదు, ఎక్కడికో వేరే ఏదో దేశానికి చేరి ఉంటాడు అని మిస్సింగ్ కేసు ఫైల్ చేసినట్టు ఇక్కడి తల్లిదండ్రులకు తెలిపారు. తల్లిదండ్రులు గుర్రం రమా సమ్మిరెడ్డిలు రోదనలు మిన్నంటాయి. కానీ దేశం కానీ దేశం అయినందున చేసేది ఏం లేక ఏడ్చుకుంటూ అప్పటి ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గౌస్ ఆలం, మంత్రి సీతక్కకు కూడా విన్నవించారు. కానీ అప్పటినుండి ఇప్పటివరకు ఒక సంవత్సరం అయినా కూడా ఇప్పటివరకు శ్రీమాన్ జాడ తెలియలేదు. శ్రీమాన్ మృతి చెందాడా? వేరే ఏదైనా దేశానికి వెళ్ళాడా అంతు చిక్కని ప్రశ్న. ఎవరికి చెప్పినా వారి గోడు ను పట్టించుకున్న పాపాన పోలేదు. నిన్న శనివారం ఆగస్టు 31, రోజున కేంద్ర వ్యవహారాల సహాయ మంత్రి, మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ ను బాధిత కుటుంబమైన గుర్రం రమా సమ్మిరెడ్డి, బంధువులు కలిశారు. కలిసి ఆయనతో వారి యొక్క గోడును విన్నవించుకున్నారు. కేంద్ర హెూంశాఖ వ్యవహారాల సహాయం మంత్రి బండి సంజయ్ కుమార్ వారి బాధను విని, నేను తప్పకుండా మీ కుమారుని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ 10 రోజులలో అవసరమైతే ఇరాన్ దేశంలో జరిగిన సంఘటనా స్థలం లో ని ప్రైవేట్ నేవీ కంపెనీ ఓనర్ ఇస్మాయిల్ తో గాని భారతీయ రాయబారులతో గాని సంప్రదించి సమస్య పరిష్కారానికి వెంటనే కృషి చేస్తానని, అక్కడ పరిస్థితులను తెలుసుకొని మీ అబ్బాయి సమస్య ను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అయినా, అధికారులైన నా కుమారుడు గుర్రం శ్రీమాన్ ఆచూకీ ఏమైనట్లు తెలుపాలని ప్రభుత్వాన్ని మిస్సయిన శ్రీమాన్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# ధర్మపురిలో గోదావరి పరవళ్లు

జగిత్యాల: ధర్మపురి వద్ద గోదావరి నది ప్రవాహం కొనసాగుతుంది. గత రెండు రోజులుగా ఎగువ కురుస్తున్న వర్షాలతో శ్రీ రామ్ సాగర్, కడెం ప్రాజెక్టు లో ఇన్ఫ్లో భారీగా పెరగడంతో అట్టి వరద నీరును పలు గేట్ల ద్వారా గోదావరి నది లోకి వదిలారు దీంతో సోమవారం ధర్మపురి వద్ద నది ఉధృతి ఒక్క సారిగా పెరిగింది. ఉదయం వేళల్లో సంతోషి మాతా ఆలయం మెట్ల పైకి నీరు చేరుకోవడంతో పోలీస్, మున్సిపల్, దేవాదాయ శాఖల అధికారులు తీర ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. భక్తులను మెట్ల పై వరకే స్నానాలకు అనుమతించారు. దేవస్థాన మైక్ ల ద్వారా ఎప్పటికప్పుడు గోదావరి వరద పరిస్థితి పై అనౌన్స్ మెంట్ చేపట్టారు.

# అధికారుల్లో హైడ్రా గుబులు...

హైదరాబాద్: హైడ్రా చాలా కట్టడాలను నేలమట్టం చేసింది. ఇందులో కొన్ని ఇళ్లున్నాయి.. మరికొన్ని ఆఫీస్‌లున్నాయి. కన్వెన్షన్లు ఉన్నాయి.. కొన్ని కాలేజీ గేట్లున్నాయి. కానీ.. అది ఎవరిదైనా.. ఎవరికైనా.. ఏది కూల్చినా నష్టమే. అందులో ఎలాంటి డౌట్ లేదు. మరి వాళ్లలా కట్టడాలు నిర్మించడానికి కారణం ఎవరు? పర్మిషన్లు ఇచ్చింది ఎవరు? రోడ్లు వేసింది ఎవరు? కరెంట్ కనెక్షన్ ఇచ్చింది ఎవరు? ఇప్పుడు అవే కట్టడాలకు నోటీసులు ఇచ్చింది ఎవరు? కూల్చింది ఎవరు?ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలి. ఎందుకంటే ఇప్పుడు నోటీసులు అందుకున్న వారిలో మెజారిటీ ప్రజలు ఒకే ప్రశ్న వేస్తున్నారు. మేము ఇక్కడ ఇళ్లు, కార్యాలయాలు నిర్మించుకొని ఏళ్లు గడుస్తోంది. అన్ని డిపార్ట్‌మెంట్స్ నుంచి సరైన పద్ధతిలో పర్మిషన్స్ తీసుకున్నాం. అలా తీసుకున్నందుకే కదా కరెంట్ నుంచి నల్లా కనెక్షన్ వరకు అన్నీ ఇచ్చారు. మా కాలనీల్లో రోడ్లు కూడా వేశారు. మరి ఇన్నేళ్ల తర్వాత వచ్చి.. ఇప్పుడు నోటీసులు ఇచ్చి కూల్చేస్తామంటే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. నిజానికి చాలా బిల్డింగ్స్ బ్యాంకుల్లో లోన్లు తీసుకొని నిర్మించారు. ఇప్పటికి కూడా వాటికి ఈఎంఐలు చెల్లిస్తున్నారు. మరి ఇప్పుడా బిల్డింగ్స్ కూలిస్తే వారు ఉండేది ఎక్కడ? వారి అప్పుల సంగతేంటి అనేది ఓ అంతు చిక్కని ప్రశ్న. మరి ప్రభుత్వం దీనిపై ఫోకస్ చేస్తుందా? లేదా?నిజానికి దీనికి అసలు కారణం ఈ కట్టడాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన వారిదే. ఎందుకంటే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోతే అసలు కట్టడాలు కట్టేవారే కాదు. అప్పుడు కూల్చాలన్న ఆలోచనే ఉండదు కదా. మరి పర్మిషన్‌లు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తారా? అనే ప్రశ్నలు వచ్చాయి. అయితే ప్రభుత్వం కూడా వారిపై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. కానీ అదొక్కటే సరిపోదు.. ఎందుకంటే ఈ కూల్చివేతల వల్ల నష్టపోయిన వారికి తగిన నష్టపరిహారం కూడా వారే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే మరో అధికారి ఇలాంటి అనుమతులు ఇచ్చేందుకు వణికిపోతాడు.ఒక్క అధికారులు మాత్రమే కాదు.. యజమానులకు ఈ ప్లేస్‌లు కట్టబెట్టిన వెంచర్ ఓనర్లను కూడా బాధ్యులను చేయాలి. తప్పుడు పత్రాలు సృష్టించి.. అధికారులను మ్యానేజ్ చేసి అనుమతులు సాధించి వెంచర్లు వేశారు. ఆ తర్వాత లబ్ధిదారులకు అమ్మి సొమ్ము చేసుకొని నోట్ల కట్టలు జేబులో కుక్కుకొని చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు తమకేం సంబంధం లేదన్నట్టుగా ఉంది వారి వ్యవహారం. కాబట్టి.. వారిని కూడా బాధ్యులను చేసి చర్యలు తీసుకోవాల్సిందే.వారి నుంచి కూడా డబ్బులను రికవరీ చేయాల్సిందే. ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. ఇలా కూల్చివేతల కారణంగా రోడ్డు మీద పడే వారి పరిస్థితి ఏంటి? అక్రమంగా నిర్మాణాలు చేసిన వారిని నిర్మోహమాటంగా పక్కన పెట్టండి. కానీ.. అన్ని అనుమతులు తీసుకొని ఇప్పుడు ఇరుక్కుపోయిన వారి పరిస్థితి ఏంటి? వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందా? అనే ప్రశ్నలు వస్తున్నాయి.నిజానికి అక్రమంగా అనుమతిలిచ్చిన అధికారుల లిస్ట్ ఇప్పటికే ప్రిపేర్ అవుతోంది. జీహెచ్ఎంసీ,హెచ్ఎండీయే, రిగేషన్, రెవెన్యూ, కొన్ని మున్సిపాలిటీల అధికారులది చాలా కీలకపాత్ర. ఎఫ్టీఎల్ , బఫర్ జోన్లలో నిర్మాణాలకు గతంలో ఎన్వోసీలు ఇచ్చారు. కొన్నింటికి నకిలీ ఎన్వోసీలు అని తెలిసి కూడా అనుమతులిచ్చారు. వీరిలో ప్రస్తుతం ఇంకా బాధ్యతలు నిర్వహిస్తున్నవారు ఉన్నారు.. రిటైర్ అయినవారు కూడా ఉన్నారు. ఇప్పుడు వీరందరి లిస్ట్ తయారు చేసి చర్యలు తీసుకునేందుకు రెడీ అవుతోంది ప్రభుత్వం. దీంతో అధికారుల్లో టెన్షన్ మొదలైంది.నిజానికి ఇప్పటికే కొంతమంది అధికారులపై కేసులు కూడా నమోదయ్యాయి. బాచుపల్లి తహశీల్దార్ గా పనిచేసిన పూల్ సింగ్ చౌహాన్. నిజాంపేట నగరపాలక సంస్థ కమిషనర్ గా పనిచేసిన రామకృష్ణారావు. జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా పనిచేసిన సుధాంశు. ఇలా మొత్తం ఆరుగురిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరు చేసిన ఘనకార్యాలు ఏంటంటే.. శిఖం భూమిని పట్టాభూమిగా చూపుతూ తప్పుడు నివేదికలు ఇవ్వడం. లే అవుట్ లకు అక్రమంగా అనుమతులు మంజూరు చేయడం. చెరువు స్థలాన్ని ప్రైవేట్ భూమిగా పేర్కొంటు రిపోర్ట్ ఇవ్వడం.ఇక చెరువు భూముల్లో నిర్మాణాలు జరుగుతున్నా చూసి కూడా పట్టించుకోకపోవడం.. ఇలా అనేక ఫిర్యాదులు ఉన్నాయి. నిజానికి ఇది మంచి చర్యే. అదే సమయంలో రోడ్డు మీద పడుతున్న వారి సంగతి కూడా ఆలోచిస్తే మరింత బాగుంటుంది.

## పెన్ గంగా నదికి పోటెత్తుతున్న వరద



ఆదిలాబాద్ : మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు రాష్ట్రంలో సైతం భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా పెన్ గంగా నదికి వరద పోటెత్తుతోంది. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దు ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం డొల్లారా వద్ద పెన్ గంగా ఉధృతంగా ప్రవహిస్తున్నది. బ్రిడ్జికి చేరువలో వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో డొల్లారా వద్ద పెన్ గంగా నది ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. వరద పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కాగా, భారీ వర్షాల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

# హైడ్రా కూల్చివేతల్ని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కూల్చివేతల అంశం హైలెట్ అవుతోంది. హైడ్రా పేరుతో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసిన రేవంత్ రె?డి చెరువుల ఆక్రమణ దారులకు ట్రయిలర్ చూపిస్తున్నారు. అక్రమాలపై పోరాటంలో రేవంత్ రెడ్డి తెగువ చూపిస్తున్నారని ఆయనకు అండగా ఉండాలన్న అభిప్రాయం ప్రజలకు వచ్చేలా చేసుకోగలిగారు. దీంతో హైడ్రా కూల్చివేతలకు ప్రజల మద్దతు లభిస్తోంది. వీలైనంత వరకూ ప్రజలకు ఇబ్బంది కగలకుండా.. పెద్దల ఆక్రమణలను కూల్చేస్తున్నారు. కొత్తగా ఆక్రమణలు జరగకుండా భయం కల్పిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలపై ఇతర పార్టీలు వ్యతిరేకించడం లేదు. జనాల నుంచి సానుకూలత వస్తుండటమే దీనికి కారణం. అయితే బీఆర్ఎస్ పార్టీ మాత్రం కూల్చివేతల్ని వ్యతిరేకిస్తోంది. బుల్డోజర్ రాజ్ వద్దని కేటీఆర్ అంటున్నారు. బీఆర్ఎస్ నేతల్ని టార్గెట్ చేయడానికే హైడ్రా తెచ్చారని కొంత మంది ఆరోపణలు చేస్తున్నారు. హరీష్ రావు మరింత దూకుడుగా కూల్చివేతల్ని వ్యతిరేకిస్తున్నారు. అయితే పేదల ఇళ్లు తొలగిస్తున్నారని అంటున్నారు. బీజేపీ కూడా కూల్చివేతల్ని సమర్థిస్తోంది. వారు పాతబస్తీలో ఓవైసీ ఆక్రమణల్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే అవి కాలేజీలు కావడంతో విద్యార్థుల చదువుల దృష్ట్యా కొంత సమయం ఇస్తామని హైడ్రా ప్రకటించింది. అంటే.. బీఆర్ఎస్ మాత్రమే నికరంగా కూల్చివేతల్ని వ్యతిరేకిస్తోంది. చెరువుల్లో కబ్జాలు చేయగలిగేది పలుకుబడి ఉన్న బడాబాబులేనని అందరికీ తెలుసు. సామాన్యులు అయితే చెరువుల్లో చెత్త వేయడానికి కూడా భయపడతారు. ఇక కబ్జాలు చేసేంత సీన్ ఉండదు. చెరువుల్లో ఇల్లు కొనుక్కున్న సామాన్యులు ఉంటారు. వారికి అమ్మేది కబ్జా చేసిన బడాబాబులే. ఎలా చూసినా.. డబ్బు అధికారం ఉన్న బడాబాబులే కబ్జా లు చేస్తారు కానీ.. సామాన్యులు కాదు. ఈ విషయంలో వేరే అభిప్రాయాలు ఉండవు. ఇప్పుడు కూల్చివేతలు కూడా బడా బాబులవే. అయితే గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయింది. నాలాలు.. చెరువులు సహా అన్నీ కబ్జాకు గురి కావడంతో హైదరాబాద్ లో వర్షం పడితే నళ్లు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. నాలుగేళ్ల కిందట ఓ సారి వరదల్లో వంద మందికిపైగా కొట్టుకుపోయారంటే.. హైదరాబాద్ లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి మారాలని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారు. కూల్చివేతల్ని వ్యతిరేకించి రాజకీయం చేస్తే.. ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను సమర్థించే పరిస్థితుల్లో బీ?ర్ఎస్ లేదు. అందుకే ఏం జరిగినా రాజకీయంగా నష్టం జరిగినా కూల్చివేతల్ని వ్యతిరేకించాలని అనుకుంటున్నారు. అయితే ఇప్పుడు పరిమితంగానే వ్యతిరేకిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలు విస్తృతమయ్యే కొద్దీ.. వ్యతిరేకతను పెంచాలని అనుకంటున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా బీఆర్?స్ కూల్చివేతలకు వ్యతిరేకమని అనుకోవచ్చు.

కాంగ్రెస్ లో ప్రకంపనలు

కాంగ్రెస్ సర్కార్‌పై సొంత పార్టీ నేతలే గుర్రుగా ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హైడ్రాపై కాంగ్రెస్ నేతలు కారాలు, మిరియాలు నూరుతున్నారు. ఇన్నాళ్లు విపక్షమే హైడ్రాను టార్గెట్ చేస్తే.. ఇప్పుడు హస్తం పార్టీ చేతులు పడుతున్నాయి. ఇష్టం వచ్చినట్లు కూల్చేస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ సీనియర్లు ఏకంగా అధిష్టానానికి ఫిర్యాదులు పంపుతున్నారట? కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు తాజాగా చేసిన ట్వీట్‌లతో ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించినట్లైందంటున్నారు.తెలంగాణ సర్కారు తీసుకొచ్చిన హైడ్రా ఇప్పుడు టాక్ ఆఫ్ ద స్టేట్‌గా మారింది. ఎక్కడ చూసిన హైడ్రా పేరే మారు మ్రోగుతోంది. ముఖ్యంగా అవుటర్ రింగ్ రోడ్ లోపల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు కాపాడటం కోసం రేవంత్ రెడ్డి సర్కారు హైడ్రా తీసుకొచ్చింది. దీనికి సీనియర్ ఐపీఎస్ ఏవీ రంగనాథ్‌ను కమిషనర్‌గా నియమించి ఫుల్ పవర్స్ ఇచ్చింది ప్రభుత్వం.రూల్స్‌కు భిన్నంగా ఉన్న కట్టడాలను నిర్ధాక్షిణంగా కూల్చేయమని ఆదేశాలిచ్చింది సర్కారు. దీంతో రోజుకొక చోట హైడ్రా బుల్డోజర్లు అక్రమ కట్టడాలపై విరుచుకుపడుతున్నాయి. ఇక చెరువుల్లో ఫుల్ ట్యాంక్ లెవల్ ? ఎఫ్టీఎల్‌లో ఉన్న నిర్మాణాలు తొలగించుకోవాలని ఇప్పటికే వందల నోటీసులు జారీ చేయడం కలకలం రేపుతోంది.ఇంత వరకు అంతా బాగానే ఉన్నా? కొన్ని అంశాలు సర్కారుకు తలనొప్పిగా మారుతున్నాయి. బంజారాహిల్స్‌లో ఒక పార్కు స్థలం విషయంలో ఏకంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కేసు పెట్టింది హైడ్రా. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న దానం.. హైడ్రాపై చిర్రుబుర్రులాడారు. సిటీకి ఎంతో మంది కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు.. దానం లోకల్ అంటూ సినీ డైలాగ్స్ వదిలారు దానం.అలా దానం రెచ్చిపోయినప్పటి నుంచి హైడ్రా దూకుడు మరింత పెంచింది. దానం నాగేందర్‌కు కూడా సీఎం అక్షింతలు వేశారనే టాక్ కూడా నడిచింది. ఇక సినీ నటుడు నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో బడాబాబుల్లో ఒక్కసారిగా హైడ్రా దడ మొదలైంది? ఈ విషయం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సంచలనంగా మారింది. ఆ తర్వాత నాగార్జున ఎన్ కన్వెన్షన్ ఇష్యూ లో స్టే ఇవ్వడంతో ఆ అంశం ఇప్పుడు కోర్టు పరిధిలో ఉంది.ఇక తాజాగా హైడ్రాపై మరో సీనియర్ కాంగ్రెస్ నేత కన్నెర్ర చేశారు. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు సోదరులకు సంబంధించిన ప్రాపర్టీని కూడా హైడ్రా నేలమట్టం చేసింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న పల్లంరాజు .. తెలంగాణ సర్కారు తీరుపై గుర్రుగా ఉన్నారు. అవుటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఏడు ఎకరాల విస్తీర్ణంలో తన సోదరుడు ప్రసాద్ నిర్వహిస్తున్న స్పోర్ట్స్ విలేజ్‌ను ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు పల్లం రాజు.నోటీసులు లేకుండా.. తమ వాదన వినకుండా ఏకపక్షంగా హైడ్రా వ్యవహరించడం బాధగా ఉందంటూ ట్విట్టర్ వేదికగా రియాక్ట్ అయ్యారు పల్లంరాజు. ఇదే విషయాన్ని పార్టీ అగ్రనాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలో ఎంతో సిన్సియర్‌గా, కేంద్ర మంత్రిగా పనిచేసి గౌరవప్రదంగా ఉన్న తమను అనవసరంగా రోడ్డు మీదకు లాగారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పల్లంరాజు. తమ కుటుంబానికి చెందిన స్థలంలో స్పోర్ట్స్ విలేజ్ ను నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు తీసుకొని నిర్వహిస్తున్నా ఇలా చేయడం కరెక్ట్ కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పార్టీ అగ్ర నాయకత్వం రాహుల్ గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జ్ కేసీ వేణుగోపాల్, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలను కలిసి పల్లం రాజు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోందిమాజీ మంత్రి పల్లంరాజు చేసిన ఫిర్యాదుపై పార్టీ అధిష్టానం కూడా ఆరా తీసిందట. ఇంతకీ తెలంగాణలో ఏం జరుగుతోందని వాకబు చేసిందట. హైడ్రా పేరుతో ఏం చేస్తున్నారని ప్రభుత్వ పెద్దలతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆరా తీసిందని పార్టీలో చర్చ జరుగుతోంది. అప్పటి నుంచే హైడ్రా నోటీసులు ఇవ్వడం ప్రారంభించిందనే టాక్ నడుస్తోంది. ఇక దీనికి తోడు గండిపేట, హిమాయత్‌సాగర్ చుట్టూ కాంగ్రెస్ ముఖ్యనేతల ఫామ్ హౌస్లు ఉండటంతో ఆయా నేతలు సైతం ఆందోళన చెందుతున్నారు.వీరి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారంటూ ప్రతిపక్షం తీవ్ర ఒత్తిడి చేస్తోంది. ఇదంతా ఒక ఎత్తయితే.. సకలం చెరువులో ఓవైసీ కుటుంబం నిర్మించిన కాలేజ్ ను ఎందుకు కూల్చడం లేదంటూ బిజేపీ ఏకంగా హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. మరోవైపు అక్బరుద్దీన్ ఓవైసీ తనపై బులెట్ల వర్షం కురిపించండి.. కానీ తన కాలేజీల జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ అల్టిమేటం జారీ చేశారు.ఇలా హైడ్రా దూకుడు ఇప్పుడు సీఎం రేవంత్ కు పులి మీద స్వారీలా మారింది. హైడ్రా చర్యలు ప్రభుత్వ పెద్దలకు పెద్ద తలనొప్పిగా మారాయి. విపక్షాల విమర్శలు, స్వంత పార్టీ నేతల ఒత్తిడితో సర్కారుకు హైడ్రా సెగ గట్టిగానే తగులుతోంది. మునుముందు ఈ వ్యవహారం ఎటు దారి తీస్తుందోనని ఆసక్తి నెలకొంది.

## డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని కలెక్టరేట్ ముట్టడి




యాదాద్రి భువనగిరి : డబుల్ బెడ్ రూం ఇండ్లకు మౌలిక వసతులు త్వరగా కల్పించి లబ్ధిదారులకు వెంటనే ఇండ్లను అందజేయాలని డిమాండ్ చేస్తూ డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భువనగిరి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జిల్లా కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసిన డబుల్ బెడ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పైసా ఖర్చులేకుండా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించకుండా తాత్సారం చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం స్పందించిన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కందకుర్తి వద్ద ఉధృతంగా గోదావరి ప్రవాహం

హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడి, కరెంట్ స్తంభాలు నేలకూడలంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా, నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరికి వరద పోటెత్తుతోంది. మహారాష్ట్రలో అతి భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరద ప్రవాహం తెలంగాణ వైపునకు కొనసాగుతోంది. దీనికి తోడుగా మంజీరాలోను వరద ప్రవాహం పుంజుకుంటుంది. త్రివేణి సంగమం నుంచి వస్తోన్న వరద ప్రవాహం అంతర్రాష్ట్ర ఫ్లైఓవర్ వద్ద గంటగంటకు భయానకంగా కనిపిస్తోంది. గోదావరి నదిలో చారిత్రక శివాలయం మునిగి పోయింది. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు.

# ఆగమాగం.. రాత్రంతా బస్సులోనే

వరంగల్: తెలంగాణలో భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో వానలు దంచికొడుతున్నాయి. రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం శివారులోని వరద నీటిలో ఆర్టీసీ బస్సు శనివారం రాత్రి చిక్కుకుంది. వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు వెళ్తుండగా.. వెంకటాపురం వద్ద తోపనపల్లి చెరువు ఒక్కసారిగా పొంగి బస్సు నీటిలోనే చిక్కుకుపోయింది.

ఆ సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా.. ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.దీంతో రాత్రంతా బస్సులోనే ఉండిపోయారు.తమను కాపాడాలని బంధువులు, అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న కలెక్టర్ గ్రామానికి చేరుకుని ట్రాక్టర్ సాయంతో బస్సులోని ప్రయాణికులను రక్షించారు. అనంతరం వారిని స్థానికంగా ఉన్న ఓ పాఠశాలకు తరలించారు. వర్షం తగ్గిన తర్వాత ప్రయాణికులను వారి స్వగ్రామాలకు తరలిస్తామని చెప్పారు. కారులో మృతదేహం మరోవైపు, సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. వైష్ణవి పాఠశాల సమీపంలోని వాగులో రెండు కార్లు, ఆటోలు వరద ఉద్ధృతికి కొట్టుకుపోగా.. కారులో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చారు. వరద ధాటికి డివైడర్ల పైనుంచి నీరు ప్రవహిస్తుండగా.. వాటిని పగలగొట్టి అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. అటు, అనంతగిరి, మేళ్లచెరువు రహదారులపై పూర్తిగా రాకపోకలు నిలిపేశారు. కోదాడ పెద్ద చెరువు మత్తడి దూకడంతో నయనగర్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి 8:30 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఈ వివరాలను వెల్లడించింది. అత్యధికంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో 299.8 మి.మీ, మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 298 మి.మీ, సూర్యాపేట జిల్లా చిలుకూరులో 297.8 మి.మీల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. అటు, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. చిన్నగూడురు 42.85, నెల్లికుదురు 41.65, పెద్దనాగారం 40.28, కొమ్మలవంచ 38.93, దంతాలపల్లి 33.25, మాల్యాల 33, మరిపెడ 32.4, లక్కవరం 31.98, కేసముద్రం 29.8, ఆమన్ గల్ 28, మహబూబాబాద్ 27.25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. రెడ్లవాడలో 43.55, కల్లెడ 27.88 సెం.మీల వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. అటు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ భారీ వర్షాలతో జన జీవనం స్తంభించింది. నగరంలోని పలు కాలనీలు నీట మునిగాయి. ఓ ప్రైవేట్ పాఠశాల ప్రాంగణంలో వరద నీరు చేరి స్కూల్ బస్సులు నీట మునిగాయి. పాలేరు జలాశయంలోకి 40 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

వనపర్తి జిల్లాలోని సరళ సాగర్‌కు వరద పోటెత్తగా పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అటు, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ ప్రమాదకరపు అంచుల్లో అలుగు పోస్తుంది. దీంతో పాలేరు గ్రామంలో ఇళ్లు నీట మునగడంతో ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేల ఎకరాల్లో పంట నీట మునిగింది.

# రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు..

హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ నష్టం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఆదేశించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణలో భారీ వర్షాలు, ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పరిస్థితిపై అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఖమ్మం జిల్లాలో 110 గ్రామాలు ముంపుకు గురవడంతోపాటు పట్టణంలోని ప్రకాశ్ నగర్ గుట్టపై 9 మంది, పాలేరు నియోజకవర్గం లోని అజ్మీరాతండ గుట్టపైన 68 మంది, బిల్డింగులపైన 42 మంది చిక్కుకున్న విషయాన్ని అమిత్ షాకు వివరించారు. వెంటనే స్పందించిన అమిత్ షా తెలంగాణకు అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా చెన్నై, వైజాగ్, అసోం నుండి 3 చొప్పున మొత్తం 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తెలంగాణకు పంపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రాణ నష్టం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్డీఆర్ఎఫ్ ను ఆదేశించారు. బండి సంజయ్ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఫోన్ లో మాట్లాడుతూ అదనంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిన విషయాన్ని తెలిపారు. అదే సమయంలో ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో మాట్లాడిన బండి సంజయ్ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అట్లాగే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వర్షాల పరిస్థితి, ప్రజలు పడుతున్న ఇబ్బందులతోపాటు కొనసాగుతున్న సహాయక చర్యలపైనా బండి సంజయ్ ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరిన బండి సంజయ్ బీజేపీ కార్యకర్తలు, నాయకులంతా జాగ్రత్తగా ఉంటూనే అధికారులను సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.మరోవైపు భారీవర్షాలతో వరంగల్‌– మహబూబాబాద్ రహదారిపై వరద పోటెత్తింది. దీంతో తోపనపల్లి దగ్గర వరదలో చిక్కుకుపోయింది ఆర్టీసీ బస్సు. ప్రయాణికుల ఆర్తనాదాలతో స్పందించిన పోలీసులు.. వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వారిని తోపనపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు–సత్యనారాయణపురం మధ్య కల్వర్టును దాటే ప్రయత్నంలో పాషా అనే వ్యక్తి వరదలో కొట్టుకుపోయాడు. వరద ప్రవాహంలో చెట్టును పట్టుకొని ఉన్న బాధితుడిని అతికష్టంపై రక్షించారు స్థానికులు. ఖమ్మం పట్టణాన్ని భారీ వరద ముంచెత్తింది. సాయి కృష్ణనగర్‌లోని అపార్ట్‌మెంట్లలో రెండో అంతస్తువరకూ వరద నీరు చేరింది. దీంతో స్థానికులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు.జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గొర్రెలను మేపేందుకు తీసుకువెళ్లిన కాపరులు అందులో చిక్కుకున్నారు. దీంతో గ్రామస్తులు స్పందించి బాధితులను కాపాడారు. అయితే 150 పైగా గొర్రెలు, మేకలు వాగులో కొట్టుకుపోయాయి. తమ జీవనాధారం పోవడంతో బోరున విలపించారు బాధితులు. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువులన్నీ అలుగుపోస్తున్నాయి. శనిగపురంలో ఊర చెరువు అలుగు పారడంతో గ్రామస్తులు చేపలవేటలో మునిగి తేలుతున్నారు.పెద్దపల్లి జిల్లా నక్కల వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మల్యాల–కొత్తపల్లి మధ్య ప్రవహిస్తున్న వాగులో కాల్వ శ్రీరాంపూర్ బిల్ కలెక్టర్ పవన్ గల్లంతయ్యాడు. మరో వ్యక్తిని స్థానికులు కాపాడారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పగిడిమారీ వద్ద వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడారు స్థానికులు. నారాయణపేట పట్టణానికి వెళ్లి తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా పగిడిమారీ వాగులో చిక్కుకున్నాడు శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి. వాగు మధ్యలో ఉన్న ఒక చెట్టు కొమ్మను పట్టుకొని వేలాడుతున్న బాధితుడిని గుర్తించిన గ్రామస్తులు..జేసీబీ సహాయంతో తాడు వేసి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.నిర్మల్ జిల్లా తానూరు మండలం రఝరి(బి) గ్రామంలో వరదల్లో కొట్టుకుపోతున్న ఆటోను కాపాడారు..గ్రామస్తులు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటేందుకు ప్రయత్నించడంతో ఈ ఘటన జరిగింది. స్థానికులు వెంటనే స్పందించడం నలుగురు బాధితులు సురక్షితంగా బయటపడ్డారు.

# ఈ సారి ఫాంహౌస్ లు టార్గెట్...

హైదరాబాద్: విశ్వనగరం హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా మార్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్)ను ఏర్పాటు చేశారు. పదేళ్లుగా హైదరాబాద్ ఏటా నీటమునుగుతోంది. చిన్న వర్షం పడినా రోడ్లు జలమయమవుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. ట్రాఫిక్ పద్మ వ్యూహాన్ని తలపిస్తోంది. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ వరద సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు హైడ్రాను ఏర్పాటు చేశారు. ఏళ్లుగా ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, నాలాలను చెర విడిపించడమే లక్ష్యంగా హైడ్రా ఏర్పాటు చేశారు. నెల రోజులుగా హైడ్రా తన పని మొదలు పెట్టింది. హైడ్రా కమిషనర్‌గా నియమితులైన రంగనాథ్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఎవరి ఒత్తిడులకు తలొగ్గకుండా తన పని తాన చేసుకుపోతున్నారు. కోర్టులు కూడా చట్ట ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు ఎవరిపైకి వెళ్లాయో అన్న టెన్షన్ ఆక్రమణదారులను ఆందోళనకు గురిచేస్తోంది. గండిపేట జలాశయంలోని పలు అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చేశారు. పలువురు ఎమ్మెల్యేలు, వ్యాపార వేత్తల ఫామ్‌హౌస్‌లు, హోటళ్లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నేలమట్టం చేశారు. తాజాగా.. హిమాయత్ సాగర్ జలాశయంలోని నిర్మాణాలపై ఫోకస్ పెట్టారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే అనేకం వందల అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేశారు. హైడ్రాకు సీఎం రేవంత్ రెడ్డి స్వేచ్ఛ ఇవ్వడంతో అధికారులు ఎక్కడా తగ్గటం లేదు. ఎవ్వరినీ వదలకుండా కూల్చివేతల పర్వం కొనసాగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి నివాసానికి కూడా నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 13 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నారు. దీంతో హైడ్రా తర్వాత టార్గెట్ హిమాయత్ సాగర్ జలాశయంగా తెలుస్తోంది. జలాశయంలోని నిర్మాణాలను కూల్చివేసేందుకు హైడ్రా అధికారులు సిద్ధమయ్యారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను గుర్తించే ప్రక్రియను జలమండలి, రెవెన్యూ అధికారులు చేపట్టారు. మొదటి దశలో కొందరు ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాలు ఇందులో ఉన్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలతోపాటు ఇతర పార్టీలు, ప్రముఖుల బంగ్లాలు జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తెలిసింది. వాటిల్లో పది భారీ నిర్మాణాలను ఇప్పటికే అధికారులు ఎంపిక చేశారు. అధికార పార్టీకి చెందిన ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే ఫాంహౌస్‌తోపాటు మరికొందరు నేతల ఫామ్‌హౌస్‌లు తెరపైకి వచ్చాయి. వచ్చే సోమవారానికి ఈ కట్టడాలపై నివేదక పూర్తి చేసి కూల్చివేతలకు సిద్ధమైనట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లో శుక్రవారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ కాలనీలో నాలాను ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్‌ఎంసీ రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. నిర్మాణాలు అక్రమమే అని తేలటంతో నేడు హైడ్రా అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. విక్రమ్ యాదవ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా కల్లు కాంపౌండ్ కొనసాగుతోందని స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన యంత్రాంగం అక్కడి కల్లును పారబోసి పూర్తిగా సామగ్రిని తొలగించి.. కూల్చివేతలు చేపట్టింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే హైడ్రా చర్యలకు ఉపక్రమించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# భారీ వర్షాల ఎఫెక్ట్.. ఏపీ, తెలంగాణ మధ్య

## 560 బస్సులు రద్దు చేసిన టీజీఎస్‌ఆర్టీసీ

రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాలను భారీగా వరదలను ముంచెత్తడంతో టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణ మధ్య రవాణాకు కీలకమైన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై పలు చోట్ల భారీగా వరద ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో వెళ్లే బస్సులను రద్దు చేసింది. హైదరాబాద్ – విజయవాడ మధ్య 560కి పైగా బస్సులను రద్దు చేస్తూ టీజీఎస్‌ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో 160, వరంగల్ జిల్లాలో 150, రంగారెడ్డి జిల్లాలో 70కిపైగా బస్సులను టీజీఎస్‌ఆర్టీసీ రద్దు చేసింది. కాగా, తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో 86 రైళ్లను రద్దు చేసినట్లుగా దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. వీటితో పాటు 70కి పైగా రైళ్లను దారి మళ్లించినట్లు తెలిపింది. రద్దయిన రైళ్లలో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయని ఎస్‌సీఆర్ వెల్లడించింది. పలు ప్యాసింజర్ రైళ్లను కూడా రద్దుచేసినట్లు తెలిపింది. మరికొన్నింటిని పాక్షికంగా రద్దుచేశామని అధికారులు





పేర్కొన్నారు. కాజీపేట–డోర్నకల్–కాజీపేట, డోర్నకల్–విజయవాడ–డోర్నకల్, విజయవాడ–గుంటూరు–విజయవాడ రైళ్లను రద్దు చేయగా, ఢిల్లీ–సెంట్రల్ చెన్నై, దానాపూర్–బెంగళూరు రైళ్లను దారి మళ్లించారు. అదేవిధంగా రాయపురం–పటేల్ నగర్, హజ్రత్ నిజాముద్దీన్–రేణిగుంట రైళ్లను మరోమార్గంలో మళ్లించారు.

# ప్రమాదంలో ప్రాజెక్టు కాల్వలు

- కృష్ణా బేసిన్ సమీప ప్రాంతాల్లో భయం
- వరదలు పెరిగి తెగిపోతున్న కాల్వలు
- ఆందోళనలో ప్రజలు
- చేపల వేటకు వెళ్లని మత్స్యకార్మికులు

మహబూబ్‌నగర్: ఎగువన నుంచి భారీ వర్షాలు కురుస్తుండటం కృష్ణానది పొంగిపొర్లుతూ శ్రీశైలం ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. దాంతో కృష్ణానదీ సమీప వాసులు బిక్కుమక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. 2009 తర్వాత ఇంత భారీ వరదలు ఎప్పుడూ రాలేదు. ఒకే రోజూ ఆరు లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో గంట గంటకు కృష్ణానది పొంగి పరవళ్లు తొక్కుతోంది. వరదలతో పాటు కాల్వల నుంచి నీరు ప్రమాదంలో ప్రవహిస్తోంది. కాల్వలు తెగి పంట పొలాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉండే కృష్ణా పరిధిలోని సోమశిల, మల్లేశ్వరం, పాతాలగంగ, బీచుపల్లి తధితర ప్రాంతాల్లో వరద ఉధృతి పెరగడంతో చేపల వేటపై నిషేధం విధించారు. సమీపంలోని వ్యవసాయ పొలం పనులు చేసుకునే రైతులు సైతం కృష్ణానది ఉధృతితో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వరద వచ్చి పంటలు ధ్వంసం అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిజ్నపల్లి మండలం లట్టుపల్లి గ్రామంలోని కెఎల్‌ఐడీ –1 అధిక వరదలకు తెగి సుమారు 3వందల ఎకరాలు పత్తి, కంది పంటలు ధ్వంసం అయ్యాయి. కల్వకుర్తి, కోడేరు పరిధిలోని కాల్వల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

కృష్ణానదిలో సెకనుకు 2213 మీటర్ల నీటి ప్రవాహం ఉంటుంది. దేశంలోనే అతి పొడవైన నదిగా కృష్ణకు పేరుంది. సముద్రమట్టానికి 1337 మీటర్ల ఎత్తున మహారాష్ట్రలోని మహాబలేశ్వరం దగ్గర చిన్న పాయగా మొదలయిన ఈ నది.. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను సస్యశ్యామలం చేస్తూ.. 14 వందల కిలోమీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో దుందుబీ నదితో సహా 120 ఉపనదులు కలుస్తాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నారాయణపేట కృష్ణ మండలం తంగెడి తగ్గర కృష్ణానది అడుగుపెడుతుంది. కాగా, వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణ, తుంగభద్ర, బీమా నదులు



పొంగి పొర్లుతున్నాయి. నదిలోకి సుమారు నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలం రిజర్వాయరులోకి చేరుతోంది. నారాయణపూర్ నుంచి 1.30 లక్షల క్యూసెక్కులు, అల్మట్టి నుంచి 1,78,574 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దాంతో తుంగభద్రకు 34,983 క్యూసెక్కులు, శ్రీశైలానికి 4 లక్షల క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌కు 2,95,390 క్యూసెక్కుల నీటిని వదలుతున్నారు. ఈసారి అత్యధికంగా 8 లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. గంట గంటకు నీరు పెరుగుతుండటంతో సమీప ప్రజలు భయంతో జీవనం సాగిస్తున్నారు. మల్లేశ్వరం, సోమశీల, పాతాళగంగ తదితర ప్రాంతాల ప్రజలు కృష్ణ ఉగ్రరూపంతో బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా చేపల వేటకు వెళ్లే వారి పరిస్థితి దయనీయంగా మారింది.

నదుల నీటిని లిఫ్టుల ద్వారా పంట పొలాలు, చిన్న రిజర్వాయర్లకు తరిలిస్తున్నారు. ముఖ్యంగా కెఎల్ఐ ద్వారా సాగు నీటి కోసం కాల్వల నుంచి నీటిని వదలుతున్నారు. గతంలో కల్వకుర్తి మండల పరిధిలోని కెఎల్ఐ కాల్వ తెగి వందల ఎకరాల పంట నష్టపోయింది. తాజాగా బిజనపల్లి మండలం లట్టుపల్లి దగ్గర కెఎల్ఐ డీ తెగిపోయి సుమారు 4 వందల ఎకరాలు నీట మునిగింది. పత్తి, వరి, జొన్న మక్క, మిరప పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇంకా కోడేర్ మండల పరిధిలోని కెఎల్ఐ మెయిన్ కాల్వలో నీళ్లు నిండుగా వస్తున్నాయి. గతంలోనే ఇక్కడ కాల్వ తెగి పంటలు దెబ్బతిన్నాయి. ఈసారి అటువంటి ప్రమాదం రాకుండా జాగ్రతలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

# జర్నలిస్టులందరికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలి

- పదేళ్ళ పాలనలో బీఆర్ఎస్ విస్మరించింది
- భూపాలపల్లి జిల్లా జాతీయ బిసి సంఘం ఇంచార్జి విజయగిరి సమ్మయ్య

మల్హర్ రావు: వర్కింగ్ జర్నలిస్టులదరికి డబుల్ బెడ్రూం ఇల్లు మెజారు చేయాలని భూపాలపల్లి జిల్లా జాతీయ బీసీ సంఘం ఇంచార్జి విజయగిరి సమ్మయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొయ్యుర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు పదేళ్ల పాలనలో జర్నలిస్టులను విస్మరించిందన్నారు. ప్రజా పాలన చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. అయిన బీఆర్ఎస్ పట్టించుకోలేదన్నారు. ప్రజా సమస్యలు ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకపోవడంలో వారి పాత్ర కిలకమని, అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు, అర్హులైన జర్నలిస్టులకు హెల్త్, అక్రిడేషన్ కార్డులు, ప్రమాద బీమా తదితరవి అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మూడు కారణాలతోనే నక్సల్స్ జనంబాట

వరంగల్: మావోయిస్టు పార్టీ కోవర్ట్‌లను హతం చేస్తుంటే... మరోవైపు మావోయిస్టులు పార్టీని వీడుతున్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు బుజగుండ్ల అనిల్ ఆలియాస్ క్రాంతి కిరణ్ పోలీసులకు లొంగిపోయాడు. ఈయన సెంట్రల్ కమిటీ సభ్యులు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోను దాదాల వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట వీళ్లిద్దరు లొంగిపోయారు. ఆనిల్ అలియాస్ క్రాంతి కిరణ్ వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం ఆర్షనపల్లి గ్రామానికి చెందిన వారు. అనిల్ తల్లిదండ్రులు ఇద్దరు అప్పటి పీపుల్స్‌వార్ గ్రూప్‌లో పనిచేసి ఇద్దరు మరణించారు. హైదారాబాద్‌లో ఎల్.ఎల్.బి. చివర సంవత్సరం చదువుతున్న సమయంలో మావోయిస్టు అనుబంధ సంస్థైన డి.ఎస్ఈయు విభాగంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు అధ్యక్షుడిగా పనిచేశాడు అనిల్. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బడే చొక్కరావు ప్రోత్సహంతో 2021 సంవత్సరంలో మావోయిస్టు పార్టీలో చేరాడు. పార్టీలో చేరిన అనిల్ కొద్ది రోజులు కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, కటకం సుదర్శన్ అలియాస్ అనంద్‌ల వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేశాడు. అనంతరం 2023లో పార్టీ ఆదేశాల మేరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం మడ్ ఏరియా కమిటీ సభ్యుడుగా బాధ్యతలు చేపట్టాడు. అక్కడే సెంట్రల్ కమిటీ సభ్యుడు, సెంట్రల్ రిజినల్ బ్యూరో కార్యదర్శి మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను అధ్వర్యంలో మావోయిస్టు పార్టీ ప్రచారకర్తగా 2023 నవంబర్ వరకు పని చేశాడు. మావోయిస్టు పార్టీ గత నెల జులైలో ఆనిల్‌ను తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఏరియా కమిటీ సభ్యుడిగా నియమించింది. గత జులై 19న బీజాపూర్ జిల్లా పరిధిలోని సిమలదొడ్డి గ్రామ ఆటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో అనిల్ ప్రత్యక్షంగా పాల్గొన్నాడని సీపీ అంబర్ కిషర్ ఝూ తెలిపారు. సీమల దొడ్డి ఎన్ కౌంటర్ తరువాత జులై చివరి వారంలో అనిల్ తిరిగి కేంద్ర కమిటీ సభ్యులు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోను దాదాల వ్యక్తిగత సహాయకుడిగా చేరాడు.

అగ్రనేతల ఆదేశాల మేరకు మావోయిస్టు పార్టీకి సంబంధించిన పత్రికల్లో కథనాలు, వ్యాసాలు, వీడియోలు, ఇంటర్‌నెట్ అనుబంధ కార్యకలపాలు నిర్వహించేవాడనీ వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.మావోయిస్టు పార్టీలో రెండేళ్లకుపైగా పనిచేసిన అనిల్ గత కొద్ది రోజులుగా నరాలకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నారు. దీనికి తోడు మావోయిస్టు పార్టీకి ప్రజల నుంచి ఎదురౌవుతున్న వ్యతిరేకత, ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలకు అకర్షితుడై జనజీవన స్రవంతి కలిసేందుకు పోలీసుల ఎదుట లొంగిపొవడం జరిగిందనీ సీపీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యుడు అనిల్‌పై ప్రభుత్వం నాలుగు లక్షల రూపాయల రివార్డు ప్రకటించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రటించిన రివార్డును నాలుగు లక్షల రూపాయల చెక్కును లొంగిపోయిన అనిల్‌కు కమిషనర్ అందజేశారు.

# సింగూరు ఎడమ కాలువకు గండి..

## పంటపొలాలను ముంచెత్తిన వరద

సంగారెడ్డి : గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి.

పలుచోట్ల చెరువులు, కాలువలకు గండ్లు పడి పంట పొలాలను ముంచెత్తాయి. తాజాగా సంగారెడ్డి జిల్లా సింగూరు ఎడమ కాలువకు గండి పడింది. పుల్కల్ మండలం ఇసోజీపేట గ్రామ శివారులో వరద ఉధృతికి సింగూర్ కెనాల్ ఎడమ కాల్వ తెగిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కాలువ దెబ్బతిని తెగినట్లు స్థానికులు చెబుతున్నారు. కాలువ కెనాల్ తెగిపోవడంతో పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. దీంతో బాధిత రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు



హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

# బదిలీ అయినా అక్కడే తిష్ట

- నెల రోజుల్లో అన్ని బిల్లులు క్లియర్
- సిద్ధిపేటలో ఆ వైద్యాధికారి తీరే ఇందుకు నిదర్శనం

హైదరాబాద్: ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం పెంచాలని ప్రయత్నిస్తున్నది. మరోవైపు కొంత మంది అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్టుగా తమ పాత పద్ధతుల్లోనే ముందుకెళ్తున్నట్టు తెలుస్తున్నది. బదిలీలు, పదోన్నతులతో ఉద్యోగుల్లో ఉత్సాహం నింపుతూ వారి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ప్రభుత్వ ప్రయత్నం. అయితే బదిలీల తర్వాత కూడా కొంత మంది అధికారులు తమ పూర్వ స్థానాల నుంచి కదలకుండా తిష్ట వేసుకుని కూర్చున్నారని ఉద్యోగుల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. సిద్ధిపేట గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొని ఉన్నట్టు సమాచారం.ఆస్పత్రికి సంబంధించిన టెండర్లలో ఒక్కో టెండర్‌లో 40 శాతం కమీషన్ తీసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. చాలా సంస్థల్లో తాము పని చేశామనీ, ఇంత పెద్ద మొత్తంలో తమను కమీషన్ ఎవరూ అడగలేదని వెండర్లు చెప్పుకోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా.. ఉన్నతాధికారులెవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పైపెచ్చు ఇటీవల జరిగిన బదిలీల్లో ఆస్పత్రి ఉన్నతాధికారి వరంగల్‌కు బదిలీ అయినప్పటికీ వెళ్లకుండా ఆస్పత్రిలోనే తిష్ట వేసుకుని కూర్చున్నారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఏండ్ల తరబడి బిల్లులకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేయకపోగా, బదిలీ అయిన నెల రోజుల్లోనే మొత్తం ఫైళ్లను క్లియర్ చేసినట్టు చెబుతున్నారు. కేవలం కమీషన్ల కోసం ఒక్కసారిగా



లక్షలాది రూపాయల బిల్లులు క్లియర్ అయినట్టు తెలుస్తున్నది. దాదాపు రూ.50 లక్షల బిల్లులను నెల రోజుల్లో క్లియర్ చేసినట్టు తెలుస్తున్నది. దీనిపై శాఖాపరమైన విచారణ చేపడితే నిజాలు బయటికి వస్తాయని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగుల పట్ల సార్ ప్రవర్తన కూడా బాగోలేదని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తున్నది. మాటలతో, చేష్టలతో వేధిస్తుండటంతో అక్కడ పని చేయడం ఇబ్బందిగా ఉందని మహిళా ఉద్యోగులు వాపోతున్నారు. ఇంక్రిమెంట్స్, సర్వీస్ బుక్స్‌కు సంబంధించిన పనులు పూర్తి కావాలన్నా కూడా ఈ అవినీతి అధికారి చేతులు తడపాల్సిందేనని చెబుతున్నారు. ఆస్పత్రికి సంబంధించిన అవినీతి కార్యక్రమాలను కూడా నేరుగా కాకుండా పట్టణంలోని ప్రముఖ ప్రింటింగ్ ప్రెస్ ప్రొప్రైటర్ ద్వారా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా రాష్ట్రంలోని ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్ది ఉద్యోగులకు భద్రత, రోగులకు మెరుగైన సేవలందించాల్సిన అవసరమున్నది.

# పగలు భక్తుడి వేషం.. రాత్రి అసలు రూపం

నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు హుండీలను కూడా స్వాధీనం చేశారు. 14 దేవాలయాల్లో వీరు దొంగతనాలకు పాల్పడ్డినట్లు పోలీసులు వెల్లడించారు.ఆ ఇద్దరు దొంగల తెలివే తెలివి.. ఉదయం పూట భక్తుల వేషం. రాత్రిపూట దేవాలయాల్లో చోరీలు. గడిచిన కొద్ది నెలలుగా ఉమ్మడి నల్గొండ జిల్లా పోలీసులకు పనిపెట్టిన ఆ ఇద్దరు గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలను టార్గెట్ చేసుకున్నారు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కి తమ ఘన కార్యాల గురించి పూసగుచ్చినట్టు చెప్పారు. నల్గొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి వీరి చేతివాటం గురించి వివరించారు.పగటి పూట భక్తుల వేషం గట్టి టార్గెట్ పెట్టుకున్న దేవాలయానికి వెళ్లి రెక్కీ చేయడం, రాత్రి పూట హుండీలను కొల్లగొట్టం పనిగా పెట్టుకున్న కత్తుల యాదయ్య, కత్తుల శివ అనే దొంగలు 14 దేవాలయాల్లో చోరీలు చేశాక పట్టుబడ్డారు. నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 3, కనగల్ మండలంలో3, నార్కెట్ పల్లి మండలంలో 2 దేవాలయాల్లో హుండీలను బద్దలు కొట్టారు. ఇంకా.. మునుగోడు, తిప్పర్తి, వేములపల్లి, చండూర్, కట్టంగూర్, హాలియా పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఒక్కో దేవాలయంలో చోరీలు చేశారు. ఇలా నల్గొండ జిల్లాలో మొత్తంగా 14 దేవాలయాల్లో వీరు దొంగతనాలకు పాల్పడ్డారు. వీరి చోరకళకు దేవాలయాల్లో బంగారు వస్తువులు, వెండి వస్తువులు దేవుడి విగ్రాల కన్నులు, మీసాలు, మెట్టెలు, నగలు, నగదు మాయం అయ్యాయి.హుండీల తాళాలు పగల గొట్టలేని చోట ఏకంగా రాత్రికి రాత్రి ఇపుప హుండీలను కూడా ఎత్తుకొచ్చారు. అంతే కాకుండా ఆలయాల్లోని సీలింగ్, టేబుల్ ఫ్యాన్లు, మైక్ సెట్ సామగ్రిని సైతం దొంగిలించారు. గడిచిన కొద్ది నెలలుగా ఆయా మండలాల పరిధిలోని గ్రామ దేవాలయాల్లో దొంగతనాలు జరుగుతుండడంతో పోలీసులు ప్రత్యేక టీమును ఏర్పాటు చేసి గాలించడం మొదలు పెట్టారు.

పోలీసులకు పట్టుబడిన కత్తులయాదయ్య అనే నిందింతుడు తిప్పర్తి మండలం కేశరాజుపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన పాత నేరగాడు. పశువుల దొంగతనం కేసులో అరెస్టై జైలు శిక్ష కూడా అనుభవించాడు. మరో నిందితుడు కత్తుల శివది కూడా ఇదే గ్రామం. వీరిద్దరూ కలిసి పగటిపూట భక్తుల వేషంలో గుళ్లూ గోపురాలు తిరిగి రెక్కీ చేసుకుని వచ్చి పక్కా ప్లాన్ తో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 14 దేవాలయాల్లో చోరికి గురైన సొత్తు బంగారు, వెండి ఆభరణాలు, నగదు , ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు

# బిలీయనీర్స్ లో ముంబై తర్వాత హైదరాబాదే...

హైదరాబాద్: ఇండియాలో బిలియనీర్లు పెరుగుతున్నారా? స్టాక్ మార్కెట్ రాకెట్ మాదిరిగా దూసుకుపోతోంది.. మరి బిలియనీర్ల మాటేంటి? ఇండియాలో ఎవరు కుబేరులయ్యారు? టాప్‌లో ఏ సిటీ ఉంది? ఇందులో హైదరాబాద్ స్థానమెంత? చివరి స్థానం ఎవరు? చాలామంది టాప్ ఉన్నతస్థాయి వర్గాలు చర్చించుకుంటున్నాయి. తాజాగా హురూన్ ఇండియా ఫుల్‌స్టాప్ పెట్టిందా? లోతుల్లోకి వెళ్దాం..చైనా రాజధాని బీజింగ్ బిలియనీర్లు కేరాఫ్‌గా మారింది. చైనా రాజధాని బీజింగ్ నుంచి ఎక్కువ మంది బిలియనీర్లు వచ్చేవారు. దాన్ని అధిగమించింది ముంబై సిటీ. ఒకప్పుడు బీజింగ్ నుంచి 91 మంది రాగా, ముంబై 92 మంది బిలియనీర్లకు కేరాఫ్‌గా మారింది.ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిలియనీర్ రాజధానిగా ముంబై మారింది. ప్రపంచంలో బిలియనీర్ల పరంగా చూస్తే న్యూయార్క్ (119) తొలి స్థానం, లండన్ (97) తర్వాత మూడవ స్థానంలో ముంబై నిలిచింది. మరో నాలుగేళ్లలో సెకండ్ ప్లేస్‌కు ముంబై చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2014 పేరుతో దేశంలోని కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఇండియాలో అత్యంత సంపద కలిగిన వ్యక్తిగా బిజినెస్ మేన్ అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ టాప్ వన్‌లో నిలిచారు. సంపద విలువ ఏడాది కాలంలో 95శాతం పెరిగి అక్షరాలా 11.6 లక్షల కోట్లకు చేరింది. ఆ తర్వాత ముకేష్ అంబానీ 10.14 లక్షలో సెకండ్ ప్లేస్‌లో నిలిచారు.పదేళ్ల కిందట టాప్ -10లో ఉండే అదానీ, ఇప్పుడు ఫస్ట్ ప్లేస్ దక్కించుకున్నారు. ఆ తర్వాత హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్, సీరమ్ ఇన్ స్టిట్యూట్, సన్ ఫార్మాలు వరుసగా మూడు, నాలుగైదు స్థానాల్లో నిలిచారు. రాష్ట్రాల పరంగా చూస్తే కుబేరుల జాబితాలో మహారాష్ట్ర తొలిస్థానం సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు వరసగా నిలిచాయి. టాప్ 10లో ఏపీ చోటు దక్కలేదు. నాలుగేళ్ల కిందట ఆరో స్థానంలో నిలిచిన తెలంగాణ.. ఇప్పుడు ఐదుకి ఎగబాకింది.బిలియనీర్లకు కేరాఫ్‌గా మెట్రోపాలిటిన్ సిటీలు నిలుస్తున్నాయి. 386 మంది బిలియనీర్లతో ముంబై అగ్రస్థానం దక్కించుకుంది. నాలుగేళ్ల కిందట 217 మంది మాత్రమే ఉండేవారు. సెకండ్ ప్లేస్‌లో న్యూఢిల్లీ నిలిచింది. 217 మంది బిలీయనీర్లు అక్కడి నుంచి వచ్చారు. నాలుగేళ్ల కిందట అందులో సగం ఉండేది.కుబేరులకు కేంద్రంగా మారుతోంది హైదరాబాద్. ధనవంతుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. నాలుగేళ్ల కిందట కేవలం హైదరాబాద్ నుంచి 50 మంది మాత్రమే ఉండేవారు.. ప్రస్తుతం 104 మంది బిలియనీర్లు ఉన్నారు. ఈ విషయంలో బెంగూళూరును వెనక్కి నెట్టేసింది. దీని తర్వాత బెంగుళూరు 100 మందితో నాలుగులో స్థానంలో నిలిచింది. తర్వాత చెన్నై నిలిచింది.తెలంగాణ నుంచి దివీస్ లేబరేటరీస్, పిచ్చిరెడ్డి-మేఘా ఇంజనీరింగ్, కృష్ణారెడ్డి -మేఘా ఇంజనీరింగ్, పార్థసారథి-హెటెరో ల్యాబ్స్, అపర్ణ కన్ స్ట్రక్షన్స్, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ వంటి కంపెనీలు నిలిచాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణ బలమైన ఆర్థిక శక్తిగా నిలుస్తోందని చెప్పవచ్చు.

# 15 ఏళ్ల వయసులో ప్రమాదంలో కాలు కోల్పోయి.. స్వర్ణ విజేత నితీష్ కుమార్ కథ




పారాలింపిక్స్ 2024లో బంగారు పతకం సాధించడం ద్వారా నితీష్ కుమార్ తన కలను నెరవేర్చుకున్నాడు. పారిస్ పారాలింపిక్స్ 2024లో భారత్‌కు ఇది రెండో స్వర్ణం.

నితీష్ చరిత్రాత్మక ప్రదర్శనతో భారత్ ఖాతాలో ఇప్పటి వరకు 8 పతకాలు చేరాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ 22వ స్థానానికి చేరుకుంది. ఈ గేమ్స్‌లో భారత్ ప్లేయర్స్ ఇప్పటి వరకు 2 స్వర్ణాలు, 3 రజతాలు, 4 కాంస్య పతకాలు సాధించారు. పారా షూటర్ అవనీ లేఖరా పారాలింపిక్ గేమ్స్ 2024లో భారత్‌కు తొలి స్వర్ణం అందించింది. పారాలింపిక్ గేమ్స్ 2024లో పురుషుల %ూా%-3 విభాగంలో నితీష్ కుమార్ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. అతను గ్రేట్ బ్రిటన్‌కు చెందిన డేనియల్ బెతెల్‌ను ఓడించాడు. నితీష్ కుమార్, డేనియల్ బేతాల్ మధ్య ఉత్కంఠభరితమైన పోటీలో ఒక్కో పాయింట్ కోసం గట్టిపోటీ నెలకొంది. చివరికి ఈ మ్యాచ్ 21-14, 18-21, 23-21తో నితీష్ కుమార్ కైవసం చేసుకున్నాడు. డేనియల్ రెండో స్థానానికి పరిమితమయ్యాడు.

15 ఏళ్ల వయసులో ప్రమాదంలో కాలు కోల్పోయిన నితీష్ కుమార్ పారాలింపిక్స్‌లో అద్భుతం సాధించాడు. కానీ ఈ విజయం సాధించడం వెనుక అతను ఎదుర్కొన్న పోరాటం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. నితీష్‌కు 15 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు, 2009లో రైలు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. చాలా కాలం మంచానికే పరిమితమయ్యాడు. తన తండ్రి నేవీలో అధికారి. తన తండ్రిలాగే నేవీ యూనిఫాం ధరించాలన్నది నితీష్ కల. కానీ ఓ ప్రమాదం అతని కలను విచ్ఛిన్నం చేసింది.

కానీ నితీష్ ఓడిపోలేదు. కష్టాలపై పోరాడారు. అలాగే చదువు పూర్తి చేశాడు. ఐఐటీ-మండిలో చదువుతున్నప్పుడు పారా బ్యాడ్మింటన్ గురించిన సమాచారం వచ్చింది. అప్పుడు ఈ ఆట అతని బలానికి మూలమైంది. ఈ రోజు ఈ గేమ్ అతని పేరును దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించేలా చేసింది. నితీష్ కుమార్ విజయంతో, ఎస్ఎల్ 3 (%ూా%3) విభాగంలో స్వర్ణ పతకం భారత్‌కు దక్కింది. టోక్యో పారాలింపిక్స్‌లో ప్రమోద్ భగత్ ఈ ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు.

# కుండపోతలతో అతలాకుతలం

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా హైదరాబాద్‌తోపాటు తెలంగాణ వ్యాప్తంగా జోరు వానలు కురుస్తున్నాయి. అయితే హైదరాబాద్‌లో రాత్రి నుంచి పడుతున్న వర్షానికి చాలా ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. వనస్థలిపురం, ఎల్బీనగర్, కొత్తపేట, హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, కోఠీ, నాంపల్లి, పంజాగుట్ట, లక్డీకపూల్, ఖైరతాబాద్, పంజాగుట్ట, బంజారాహిల్, అమీర్పేట ఇలా అన్ని ప్రాంతాల్లో వర్షం దంచి కొడుతోంది. కొన్ని ప్రాంతాల్లో ముందుజాగ్రత్తగా విద్యుత్ సరఫలా నిలిచిపోయింది. హైదరాబాద్‌లో 48 గంటల్లో భారీ వర్షాలు ఖాయమంటున్నారు వాతావరణ శాఖ నిపుణులు. దీని కారణంగా మరోసారి మూసి వరదలు చూస్తామని హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ ప్రజలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం బంగాలాఖాతంలో ఏర్పడిన ద్రోణి మరింత బలపడి తీరంవైపునకు దూసుకొస్తుందని చెబుతున్నారు. దీని కారణంగా 48 గంటల పాటు హైదరాబాద్‌ను కుండపోత వానలు కుమ్మేస్తాయని అలర్ట్ చేస్తున్నారు. ఈ వర్షాలు కారణంగా కృష్ణ, మూసి, మంజీర నదులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుందని పరివాక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు. వర్షం కారణంగా బంజారాహిల్స్‌లో కారు బీభత్సం సృష్టించింది. అతి వేగంగా వచ్చిన కారు పార్కింగ్ చేసి ఉన్న కారును, ఆటోను ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో కారు పాల్టీలు కొట్టింది. ఇందులో ఉన్న డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడబోతున్నాయని వాతావరణ శాఖ చెప్పడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎక్కడా నీరు నిలిచిపోకుండా, నాళాల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని అంటున్నారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ వాయుగుండంగా మారనుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కుమ్మేస్తున్నాయియ. తెలంగాణలో కూడా చాలా జిల్లాల్లో జోరు వానలు పడుతున్నాయి. ఆదిలాబాద్, కుమ్రుం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కరుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

# మీరు మా హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు.. ప్రీతి, నిషాద్‌లకు సచిన్ అభినందనలు



పారాలింపిక్స్ 2024లో పతకాలు సాధించిన ఆటగాళ్లను క్రికెట్ దిగ్గజం, టీమిండియా మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ అభినందించారు. ఆదివారం భారత ఆటగాళ్లు రెండు పతకాలు సాధించారు. భారత్‌కు హైజంప్‌లో ఒక పతకం, స్ప్రింట్‌లో ఒక పతకం లభించింది. దీంతో.. భారత్‌కు పతకాల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో.. సచిన్ టెండూల్కర్ స్పందిచారు. 2024 ఒలింపిక్ గేమ్స్‌లో పతకాలు గెలిచిన.. మంచి ప్రదర్శన చేసిన ఆటగాళ్లను ప్రశంసించారు.సచిన్ టెండూల్కర్ '%శ%'లో పోస్ట్ చేస్తూ.. 'ప్రీతీ పాల్, నిషాద్ పతకాలు సాధించడం ద్వారా సంఖ్యను పెంచారు. మీరిద్దరూ కలిసి కొత్త శిఖరాలను అధిరోహిస్తున్నారు. మా హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు'. అని పేర్కొన్నారు.

పారాలింపిక్ గేమ్స్ 2024లో.. భారత్ ఇప్పటివరకు ఒక స్వర్ణం, రెండు రజతం.. 4 కాంస్య పతకాలను గెలుచుకుంది. పాయింట్ల పట్టికలో భారత్ 27వ స్థానంలో ఉంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్ 1 ఈవెంట్‌లో అవని లేఖరా బంగారు పతకాన్ని గెలుచుకోగా, పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్ 1 ఈవెంట్‌లో మనీష్ నర్వాల్ రజత పతకాన్ని సాధిచాడు. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రీతీ పాల్ రెండు కాంస్య పతకాలు సాధించింది. షూటింగ్‌లో రుబీనా ఫ్రాన్సిస్, మోనా అగర్వాల్ కాంస్య పతకాలు సాధించారు. రానున్న రోజుల్లో భారత్‌కు మరికొన్ని పతకాలు వచ్చే అవకాశం ఉంది. కాగా.. భారత ఆటగాళ్లు ఇంతకుముందు కూడా పారా గేమ్స్‌లో రాణిస్తున్నారు.

# మూడు దశల్లో బ్యాలెట్ విధానంలో ఎన్నికలు

హైదరాబాద: తెలంగాణలో సర్పంచ్ ఎన్నికల కోసం ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పలువురు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అయిపోయన నేతలు ప్రజలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మంచి చెడులకు హాజరై.. ప్రతి సందర్భాన్ని వాడుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలపై నిర్వహణపై తెలంగాణ ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) పార్థసారథి కీలక ప్రకటన జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. శనివారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఈసీ సమావేశమయ్యారు. నోటిఫికేషన్ వచ్చే వరకూ ఓటర్ల నమోదు కొనసాగుతుందని చెప్పారు. ఈనెల 6న ముసాయిదా జాబితా రిలీజ్ చేస్తామని తెలిపారు. మొత్తం మూడు దశల్లో బ్యాలెట్ విధానంలో ఎన్నికలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల జాబితాల ఆధారంగా వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాను ప్రస్తుతం రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.పంచాయతీ ఎన్నికలకు ప్రవర్తనా నియమావళి (కోడ్) ఈసారి కఠినంగా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా, కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని విపక్షాలు ఎస్ఈసీని కోరాయి. ఃఅ రిజర్వేషన్లలను 42 శాతం పెంచాలని డిమాండ్ చేశాయి.

అయితే ఈ అంశం తమ పరిధిలో లేదని.. సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వమే రిజర్వేషన్లు ఖరారు చేస్తుందని ఎస్ఈసీ వెల్లడించారు.కాగా, రాష్ట్రంలో 540 గ్రామీణ మండలాల్లోని 12,966 గ్రామాల్లో 1,14,620 వార్డులు పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. వీటి జాబితాను పంచాయతీరాజ్ శాఖ తాజాగా ఈసీకి సమర్పించింది. గత ఎన్నికల్లో 535 మండలాల్లోని 12,732 గ్రామాల్లో ( మె?త్తం 1,13,152 వార్డులు) ఎన్నికలు జరిగాయి. గతంతో పోలిస్తే ఈసారి 5 మండలాలు, 234 గ్రామాలు, 1,468 వార్డులు పెరిగాయి. ఈసారి అత్యధికంగా నల్గొండ జిల్లాలో 868 గ్రామాల్లోని 7,482 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి.

# పుజారా, రహానే స్థానాలకు ఆ ఇద్దరే సరైనోళ్లు: డీకే



గత బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో భారత సీనియర్ క్రికెటర్లు ఛతేశ్వర్ పుజారా, అజింక్య రహానే కీలక పాత్ర పోషించారు.

వచ్చే నవంబర్‌లో మొదలయ్యే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో వారిద్దరు ఆడడం దాదాపు అసాధ్యమే. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకొనేందుకు భారత్ సహా ఆస్ట్రేలియాకు ఈ సిరీస్ కీలకం. ఈ నేపథ్యంలో బలమైన జట్టుతో కంగారో గడ్డపైకి భారత్ వెళ్లనుంది. అయితే పుజారా-రహానే స్థానాల్లో ఎవరు ఆడుతారనే ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో టీమిండియా వెటరన్ క్రికెటర్ దినేశ్ కార్తిక్ తన అభిప్రాయాలను వెల్లడించాడు.


ఛతేశ్వర్ పుజారా, అజింక్య రహానే స్థానాల్లో శుభ్‌మన్ గిల్, సర్ఫరాజ్ ఖాన్ సరైనోళ్లు అని దినేశ్ కార్తిక్ అభిప్రాయపడ్డాడు. క్రిక్‌బజ్ షోలో డీకే మాట్లాడుతూ%ొ% 'సీనియర్ల స్థానాలను భర్తీ చేయడం కష్టమే. కానీ కుర్రాళ్లకు అవకాశాలు ఇస్తేనే భవిష్యత్తులో మెరుగైన ప్రదర్శన చేస్తారు. పుజారా, రహానే స్థానాల్లో గిల్-సర్ఫరాజ్ ఆడితే బాగుంటుంద నేది నా అభిప్రాయం. వీరిద్దరూ ఇంగ్లండ్‌పై అద్భుతంగా ఆడారు.

ఆస్ట్రేలియాతో సిరీస్‌కూ వీరిద్దరినీ ఎంపిక చేస్తారనుకుంటున్నా' అని అన్నాడు. నాలుగేళ్ల క్రితం టెస్టుల్లోకి అరంగేట్రం చేసిన శుభ్‌మన్ గిల్.. ఇప్పటివరకు 25 టెస్టుల్లో 1,492 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు అంతర్జాతీయ క్రికెట్‌లోకి లేటుగా వచ్చిన సర్ఫరాజ్ ఖాన్.. మూడు టెస్టుల్లో 200 పరుగులు బాదాడు. ఇందులో మూడు హాఫ్ సెంచరీలు ఉండడం గమనార్హం. గిల్ ఇప్పటికే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆడిన విషయం తెలిసిందే.

# నిండుకున్న చెరువులు రాకపోకలకు అంతరాయం

మేడ్చల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో పలు గ్రామాల్లోని వాగులు, చెరువులు నిండుకుని అలుగులు పారుతున్నాయి. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు మేడ్చల్ పెద్ద చెరువు అలుగులు పారుతుంది. అదేవిదంగా గౌడవెల్లి వాగు ఉదృతంగ ప్రవహించడంతో మేడ్చల్ నుండి గౌడవెల్లి కి రాకపోకలు నిలిచిపోయాయి. మేడ్చల్ మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చెరువులు, వాగుల వద్ద మేడ్చల్ సిఐ సత్యనారాయణ భారీ కేడ్లు ఎర్పాటుచేసి పోలిసు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అటు శామీర్ పేట్ మండలంలోని అలియాబాద్ వాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో అలియాబాద్ గ్రామం నుండి బొమ్మరాసిపేట్ గ్రామానికి రాకపోకలు ఇలిచిపోయాయి. శామీర్ పేట్ సిఐ శ్రీనాథ్ ప్రజలెవరూ వాగు దాటకుండా భారి కేడ్లు ఏర్పాటు చేసి ఆయా చెరువుల వద్ద పోలీసు సిబ్బందిని నియమించారు. హకీంపేట్ లోని రాజీవ్ రహదారిపై చెట్లు విరిగి పడడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.పోలీసులు, తూంకుంట మున్సిపాలిటీ సిబంది చెట్లను తొలగించి, ట్రాపిక్ ను క్లియర్ చేశారు. మూడుచింతలపల్లి మండలం లోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందినదప్పు రాములు ఇంటిపై వేప చెట్లు విరిగిపడింది. ఉద్దేమర్రి గ్రామం నుండి కేశవపూర్, కీసరకు వెళ్ళే రోడ్డు పై చెట్లు విరిగి పడడంతో చెట్టును తొలగించారు. భారీ వర్షాల కారణంగా జిల్లా అధికారులు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నందున మేడ్చల్ జిల్లా కలెక్టరేట్లో నిర్వహి ంచాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు.మరో 24 గంటల పాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరిక కారణంగా మేడ్చల్ జిల్లాలోని అన్ని పాఠశాలలకు జిల్లా కలెక్టర్ గౌతం సోమవారం సెలవు ప్రకటిం చారు. జిల్లా వ్యాప్తంగా సహాయాక చర్యలకు ట్రోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశారు.

# రిటైర్మెంట్ ప్రకటించిన విండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావో!



వెస్టిండీస్ దిగ్గజ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో ప్రొఫెషనల్ టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) 2024 తనకు చివరి సీజన్ అని తెలిపాడు.

ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించాడు. బ్రావో ఇప్పటికే అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఇది ఓ గొప్ప ప్రయాణం అని, సీపీఎల్ 2024 తనకు చివరి సీజన్ అని బ్రావో పేర్కొన్నాడు. ఎక్కడైతే (ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్) మొదలు పెట్టానో.. అక్కడే ముగించాలనుకుంటున్నా అని తెలిపాడు. సీపీఎల్‌లో ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్‌కు డ్వేన్ బ్రావో ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. సీపీఎల్‌లో అద్భుతమైన కెరీర్‌ను కలిగి ఉన్నాడు. ఈ టోర్నీలో అత్యధిక వికెట్ల వీరుడిగా కొనసాగుతున్నాడు. తన సారథ్యంలో మూడు జట్లను ఛాంపియన్‌గా నిలిపాడు. మొత్తంగా బ్రావో ఐదు సీపీఎల్ టైటిళ్లను గెలిచాడు. 103 సీపీఎల్ మ్యాచ్‌లలో 1155 పరుగులు చేశాడు. అంతేకాదు 128 వికెట్లు తీశాడు. మరోవైపు 161 ఐపీఎల్ మ్యాచ్‌లలో 1560 రన్స్, 183 వికెట్స్ పడగొట్టాడు.

2006 నుంచి ప్రొఫెషనల్ టీ20లు ఆడుతున్న డ్వేన్ బ్రావో.. మొత్తం 579 మ్యాచ్‌లు ఆడి 630 వికెట్లు పడగొట్టాడు. పొట్టి క్రికెట్ చరిత్రలో బ్రావోతో పాటు రషీద్ ఖాన్ మాత్రమే 600 వికెట్ల మైలురాయిని దాటాడు. ఇక వెస్టిండీస్ తరఫున 40 టెస్టులు, 164 వన్డేలు, 91 టీ20లు ఆడాడు. 6500 పరుగులు చేసి.. 363 వికెట్లు తీశాడు. ఇప్పటికే చెన్నైలో కోచ్‌గా ఉన్న బ్రావో.. మరిన్ని జట్లకు సేవలందించే అవకాశం ఉంది.

# విద్యుత్తు షాక్ తో ప్రిన్సిపాల్ మృతి

ఘట్కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి కొండాపూర్ విజ్ఞాన్ స్కూల్ లో షార్ట్-సర్క్యూట్ తో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందారు. విజ్ఞాన్ స్కూల్ లో అల్పాహారం తీసుకున్న తర్వాత తిరిగి తన క్వార్టర్స్ కు చేరుకొని క్వార్టర్స్ పైభాగంలో నీరు నిల్వ ఉండడంతో రాడ్డుతో నీటిని తొలిగిస్తుండగా క్వార్టర్స్ పైభాగం ఉన్న విద్యుత్ వైర్లకు రాడ్డు తగిలి షాట్ సర్క్యూట్ తో అక్కడికక్కడే మృతి చెందిన ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు.. ఖమ్మంకు చెందిన శ్రీనివాసరావుకు స్కూల్ యాజమాన్యం కేటాయించిన క్వార్టర్స్ లో ఒంటరిగా ఉంటూ, స్కూల్ లో విద్యార్థులకు బోధన చేస్తు విధులు నిర్వహిస్తున్నాడు..సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అదే కళాశాలలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయుడు రాజేష్ స్కూల్ పై భాగంలో పడి ఉన్న శ్రీనివాసరావును గమనించి వెంటనే యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**